MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 258 | పేజీలు : 8 | ఆదివారం 6 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



అసెంబ్లీ ఎన్నికల వేళ 4 రాష్ట్రాల్లో జనగణన

- ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!
- ఉత్తరాఖండ్, గోవా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్‌లో జనగణన షెడ్యూల్ రిలీజ్
- 2026 డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 4 వరకు నిర్వహణ
- వచ్చే ఏడాదే 4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

5



మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది

- నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్యానికి మీడియా, న్యాయవ్యవస్థ కీలకం
- మీడియా రంగంలో విశ్వసనీయత సంక్షోభం సమస్య మరింత తీవ్రమైంది
- ప్రజాస్వామ్య పురోగతికి స్వతంత్ర మీడియా ఎంతో ముఖ్యం
- ప్రజలు, సమాజం కోసం పనిచేస్తే క్రెడిబిలిటీ తిరిగి సాధించొచ్చని సూచనలు

మన విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శం



- ఉపాధ్యాయులే భవిష్యత్ నిర్మాతలు
- ప్రతి పాఠశాలకూ ఓ బ్రాండ్ ఉండాలి
- ఏఐ వచ్చినా ఉపాధ్యాయుల స్థానం భర్తీ కాదు
- సున్నితమైన పరిస్థితుల్లో విద్యాబోధన టీచర్లకు ఓ సవాల్
- ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



విజయవాడ, మహానగర్

విద్యార్థులను భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు కోర్సులను పునర్‌వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏఐ, క్వాంటం, రోబోటిక్స్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. నగతంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి, విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు. ఏఐ వంటి వ్యవస్థలు వచ్చినా ఉపాధ్యాయుల స్థానాన్ని ఏదీ భర్తీ చేయలేదని చంద్రబాబు అన్నారు. ఉపాధ్యాయుల వద్ద లేని సమాధానం ఏఐ కూడా చెప్పలేదని పేర్కొన్నారు. సాంకేతికతతో పాటు విద్యార్థుల్లో విలువలు, సంస్కృతి, దేశభక్తి, ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించాలని సూచించారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై మరింత పెరిగిందన్నారు. విద్య కేవలం థియరీకి పరిమితం కాకూడదని, విద్యార్థులు బయటకు వెళ్లి అనుభవపూర్వకంగా నేర్చుకునేలా అవకాశాలు కల్పించాలని సూచించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానం ఉండాలన్నదే తన ఆలోచన అని వెల్లడించారు. భవిష్యత్తును ముందుగానే ఊహించి నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఐటీ విప్లవాన్ని - మిగతా2లో



ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కీలక మార్పులు

- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను నియమించిన కాంగ్రెస్ అధిష్టానం
- ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులుగా పీవీ మోహన్ నియామకం
- ఆదేశాలు జారీ చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

5

ఉత్తీర్ణులు కాకుండానే ఉద్యోగాలా?



- చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్
- డీఎస్సీ స్కామ్‌పై రోజురోజుకూ బయట పడుతున్న మరిన్ని ఆధారాలు
- దొడ్డి దారిన ఉద్యోగాలు ఇచ్చేందుకు కొత్త జీవోలు తీసుకురావడం నిజం కాదా?
- నియామకాలు ముగియగానే మళ్లీ ఆ జీవోలు రద్దు చేయడం వాస్తవం కాదా?
- ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలతో ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి
- సమాధానం చెప్పలేక ప్రశ్నించిన వారి గొంతు నొక్కేస్తుండటం దుర్మార్గం

అమరావతి, మహానగర్

డీఎస్సీ--2025 నియామకాల్లో అక్రమాల వ్యవహారానికి సంబంధించి రోజురోజుకూ మరిన్ని ఆధారాలు బయట పడుతున్నాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. వాటన్నింటిపై వెళ్లువలా తలెత్తే అన్ని ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పాలని నిలదీశారు. అంతా పారదర్శకంగా జరిగిందన్నప్పుడు, దాచుకోవడానికి ఏమీ లేనప్పుడు మీ కెందుకింక భయం? అని ప్రశ్నించారు. డీఎస్సీ స్కామ్‌పై ప్రతిపక్షంతో పాటు గళం విప్పిన కొన్ని మీడియా సంస్థలు, సామాజిక కార్యకర్తలకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను మెటా ద్వారా ఎందుకు బ్లాక్ చేయిస్తున్నారని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ--2025 నియామకాలు నిజాయితీగా, పారదర్శకంగా జరిగాయని అనుకుంటే వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని సీఎం చంద్రబాబుకు సవాల్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. - మిగతా2లో



డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- 'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'
- 'విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో అప్రమత్తంగా ఉండాలి'
- ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచన
- విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచన
- పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లించాలని పిలుపు

5

బ్యాలెట్ బదులు ఈవీఎంలు

- ఏపీలో మున్సిపల్ పోరుకు కొత్త రూల్స్..
- మున్సిపల్ ఎన్నికల్లో బ్యాలెట్ బదులు తొలిసారిగా ఈవీఎంలు, నోటా వినియోగం
- డిప్యూటీ మేయర్ ఎన్నికకు కఠిన నిబంధనలు.. విప్ ధిక్కరిస్తే సభ్యత్వం రద్దు
- నామినేషన్ డిపాజిట్లు ఖరారు.. అభ్యర్థులకు అఫిడవిట్ తప్పనిసరి
- కడప కార్పొరేషన్‌లో 66కు పెరగనున్న డివిజన్లు
- ఎన్నికల నిర్వహణపై మూడు కీలక జీవోలు జారీ చేసిన ప్రభుత్వం



అమరావతి, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న బ్యాలెట్ పత్రాల విధానానికి స్వస్తి పలికి, ఇకపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు) వాడాలని నిర్ణయించింది. ఓటర్లకు తొలిసారిగా 'నోటా' (నన్ ఆఫ్ ది ఎబౌవ్) ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. - మిగతా2లో

మన విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శం



-మొదటిపేజీ తరువాయి

అందిపుచ్చుకున్నామని సీఎం చెప్పారు. పాలనా సంస్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలు తెలుగు వారిని అగ్రస్థానంలో నిలిపాయని పేర్కొన్నారు. వచ్చే 10--15 ఏళ్లలో విభిన్నమైన భారతదేశాన్ని చూడబోతున్నామని అన్నారు. ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలలను ప్రత్యేక బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. చదువుకునే వయసులో ప్రతి విద్యార్థి బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలని, ఆవిష్కరణలు, సృజనాత్మకత, కష్టాలను ఎదుర్కొనే తత్వాన్ని వారిలో పెంపొందించాలని సూచించారు. ఏడో తరగతి చదివే విద్యార్థులు సైతం ఏఐలో ప్రావీణ్యం సాధించేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి పాఠశాల మోడల్ స్కూల్‌గా మారితే కుటుంబాలు, గ్రామాలు, చివరకు దేశం మారుతుందని చెప్పారు. విద్యార్థులను నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్దాలని కోరారు. క్రీడలు, ప్రకృతితో విద్యార్థులను అనుసంధానం చేయాలని, ప్రతి శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 2027 నాటికి రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. క్లిక్కర్, ఏఐ ట్యూటర్ వంటి సాంకేతికతలను ఉపయోగించి బోధనలో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటే ఆంధ్రప్రదేశ్ దేశంలో నంబర్ వన్‌గా ఉండాలని ఆకాంక్షించారు. ఆ లక్ష్యానికి పునాది పాఠశాలల్లోనే పడాలని, దాన్ని సాధించేది ఉపాధ్యాయులేనని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఉపాధ్యాయుల నియామకాలు అవసరమనే ఆలోచనతో తమ హయాంలోనే డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకంపైనే చేశామని చెప్పారు. నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు 350కి పైగా పిటిషన్లు వేసినా వాటన్నింటినీ అధిగమించి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఉపాధ్యాయుల ప్రతిభే వారికి కొలమానంగా ఉండేలా కౌన్సెలింగ్ ప్రక్రియను తీసుకొచ్చామని, ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చామని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని చెప్పారు. టెక్నాలజీతో ఉపాధ్యాయులకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని, టీచింగ్ ప్రొఫెషన్ పూర్తిగా మారిపోయిందని అన్నారు. సున్నితమైన పరిస్థితుల్లో ఉపాధ్యాయులు వివేకంతో ఆలోచించి వ్యవహారాన్ని చక్కబెట్టాలని సూచించారు. మానసిక బలహీనతతో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావంతో చెడు అలవాట్లకు బానిస కావడం ఆవేదన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో విద్యాబోధన సవాళ్లతో కూడిన అంశంగా మారిపోయిందని పేర్కొన్నారు. దీనికి పరిష్కారంగా ఆధ్యాత్మికత, యోగా, ధ్యానం వంటి ఉత్తమ పద్ధతులను అలవాటు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీఎం పలు వరాలు ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకారం తెలిపామని, రెండు డీఏలను అక్టోబరు నుంచి ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 2022 సరెండర్ లీవ్ మొత్తాన్ని సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. పోలీసులకు ఈ దసరాకు అదనపు సరెండర్ లీవ్ ఇస్తామన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10--15 శాతం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఎంప్లాయీస్ హెల్త్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రతి నెలా జమ చేసేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. గతంలో ఉద్యోగులకు ప్రతినెలా మొదటి తేదీన జీతాలు అందేవి కావని, ఇప్పుడు ఆ ఇబ్బందులు లేకుండా చేశామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎప్పుడూ గౌరవం ఇస్తుందని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే అత్యుత్తమమని సీఎం అన్నారు. విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి, ప్రకృతి పట్ల ప్రేమను విద్యలో భాగం చేయాలని సూచించారు. జీవితాంతం నేర్చుకునే విధానాన్ని అలవాటు చేసుకోవాలని చెప్పారు. భారత్ మళ్లీ విశ్వగురు స్థానానికి రావాలంటే అది ఉపాధ్యాయుల వల్లే సాధ్యమని, విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దాలని సీఎం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 175 మంది ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అవార్డు సాధించిన దివ్యాంగ ఉపాధ్యాయుడు ఎం. పద్మనాభాన్ని సత్కరించేందుకు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి స్వయంగా వేదిక దిగివెళ్లి ఆయనను సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, ఎంపీ కేశినేని శివనాథ్ సహా విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణులు కాకుండానే ఉద్యోగాలా?

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఆ పోస్టులో ఇంకా ఏమన్నారంటే..

వెలుగులోకి కొత్త అధారాలు, వాస్తవాలు

'రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మరిన్ని కొత్త ఆధారాలు, వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. అవన్నీ డీఎస్సీలో తీవ్ర అక్రమాలను బయట పెడుతూ, సీఎం చంద్రబాబు వెన్నుపోటు పార్టీ సమాధానం చెప్పాల్సిన అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పి, నిజాలను నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణకు అంగీకరించాల్సిన ప్రభుత్వం.. స్వతంత్ర దర్యాప్తును తిరస్కరిస్తోంది. మరో వైపు ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేసే మార్గాన్ని వెన్నుపోటు పార్టీ ఎంచుకుంది. డీఎస్సీ నియామకాల అక్రమాలపై గొంతెత్తుతున్న ప్రతిపక్షంతో పాటు, కొన్ని మీడియా సంస్థలు, సామాజిక కార్యకర్తలు, వ్యక్తులకు సంబంధించిన సామాజిక పోస్టులు, ఖాతాలను మెటా సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో నియంత్రిస్తున్నారు. 'చట్టపరమైన ఆదేశాలు' అంటూ వాటిని తొలగించడం లేదా జియో బ్లాక్ చేయడం జరుగుతోంది. ఆ ఆంక్షల బారిన పడిన ఖాతాలు, పేజీలు, ఫేస్‌బుక్‌లో సాక్షి టీవీ, ఇన్‌స్టాగ్రామ్‌లో సాక్షి డిజిటల్, బిగ్ టీవీ, జగనన్న కనెక్ట్‌తో పాటు డీఎస్సీ స్కామ్‌పై ప్రశ్నిస్తున్న ఇతర వ్యక్తిగత హ్యాండిల్స్ కూడా ఉన్నాయి.

ఇది పరిపాలన కాదు. నియంతృత్వ సెన్సార్‌షిప్

వెన్నుపోటు పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వ్యవహారం కేవలం డీఎస్సీ స్కామ్‌తోనే ఆగిపోవడం లేదు. వెన్నుపోటు పార్టీ ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలు, అమలు కాని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ ఎన్నికల హామీలు, నిరంకుశత్వం, అధికార దుర్వినియోగంపై ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, ప్రశ్నించిన వారి గొంతు నొక్కేస్తున్నారు. ఇది పరిపాలన కాదు. నియంతృత్వ సెన్సార్‌షిప్! వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు. ప్రశ్నలు రాజకీయంగా ఇబ్బందికరంగా ఉన్నాయనే కారణంతో ప్రతిపక్షం, మీడియా, సామాజిక కార్యకర్తలు, పౌరుల గొంతు నొక్కే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదు.

ప్రజలకు సమాధానం చెప్పండి

చంద్రబాబు గారూ.. మీరు భయపడుతున్నది ప్రశ్నలకా? లేక వాటి సమాధానాలకా? డీఎస్సీ నియామకాల్లో ప్రతిరోజూ కొత్తగా వెలుగు చూస్తున్న ఆధారాలు ఒకవేళ అవాస్తవమైతే.. ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలతో వాటిని ఖండించండి. ఆ పని చేయడం లేదు. ఇంకా సీబీఐ విచారణను కూడా ఎందుకు తిరస్కరిస్తున్నారు? అక్రమాలను బయట పెడుతున్న వారి గొంతు ఎందుకు అణచి వేస్తున్నారు? వారి పోస్టులు, ఖాతాలను ఎందుకు నియంత్రిస్తున్నారు? ఒక్క విషయం గుర్తుంచుకోండి. ఒక పోస్టును తొలగించినంత మాత్రాన ఆధారాలు చెరిగిపోవు. ఒక ఖాతాను బ్లాక్ చేసినంత మాత్రాన నిజాన్ని పాతిపెట్టలేరు. ప్రతిపక్షాన్ని రాజకీయంగా ఎదుర్కోండి. ప్రజలకు ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెప్పండి. రాజ్యాంగబద్ధంగా పాలించండి. ఉత్తీర్ణులు కాకుండానే ఉపాధ్యాయ ఉద్యోగాలా? డీఎస్సీ పరీక్ష రాయకుండానే, ఉపాధ్యాయ అర్హత పరీక్ష 'టెట్'లో ఉత్తీర్ణులు కాకుండానే కొందరికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చి.. మిమ్మల్ని మీరు ఎలా సమర్థించుకుంటారు? డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా భర్తీ కోసం కొత్తగా జీవోలు జారీ చేశారు. ఆ నియామకాలు పూర్తి చేయగానే, ఆ జీవోలు రద్దు చేశారు. అయినప్పటికీ ఆ జీవోల ద్వారా నియమితులైన అభ్యర్థులు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. అంటే అక్రమ నియామకాలకు ముందు గేట్లు తెరిచి.. ఆ నియామకాలు పూర్తయ్యాక వాటిని మూసివేశారు. ఇదంతా అవినీతిని సూచించడం లేదా? అందుకే నియంతృత్వ సెన్సార్‌షిప్‌లో భాగంగా నియంత్రించిన ప్రతి సామాజిక మాధ్యమ ఖాతాను, పోస్టును, కంటెంట్‌ను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నా. అలాగే అందరూ లేవనెత్తుతున్న ప్రశ్నలన్నింటికీ స్పష్టమైన సమాధానాలు చెప్పాలి.

స్వతంత్ర దర్యాప్తు ద్వారా నిజానిజాలు తేల్చండి

చంద్రబాబుకు.. ఆయన ప్రభుత్వానికి నేను ఒక సవాల్ చేస్తున్నా. డీఎస్సీ--2025 నియామకాలు నిజాయతీగా, పారదర్శకంగా జరిగాయని మీరు అనుకుంటే వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించండి. స్వతంత్ర దర్యాప్తు ద్వారా నిజానిజాలు తేల్చండి. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు ఆధారాలతో సహా బయట పడుతున్నందున, వాటికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలి. అంతే కాకుండా వెంటనే సామాజిక మాధ్యమాల ఖాతాలు పునరుద్ధరించండి. వాటి సెన్సార్‌షిప్‌ను ఆపండి. అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పండి. సీబీఐ విచారణకు ఆదేశించండి. అంతా పారదర్శకంగా జరిగినప్పుడు, దాచుకోవడానికి ఏమీ లేనప్పుడు మీకెందుకింకా భయం?' అని వైఎస్ జగన్ నిలదీశారు.

ద్వారంపూడిపై ప్రభుత్వం దృష్టి

కాకినాడ

కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్‌లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నింటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది.ద్వారంపూడిపై కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది.కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్స్ట్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు.టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

బ్యాలెట్ బదులు ఈవీఎంలు

-మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నూతన నిబంధనలతో కూడిన మూడు కీలక జీవోలను జారీ చేసింది. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రభుత్వం కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. మున్సిపల్ కార్పొరేషన్ తొలి సమావేశం జరిగిన 15 రోజుల్లోగా డిప్యూటీ మేయర్ ఎన్నిక పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికకు ఒకరోజు ముందే పార్టీలు తమ కౌన్సిలర్లకు విప్ జారీ చేయాలి. విప్‌ను ధిక్కరించిన వారి సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేస్తారు. ఒకవేళ ఓట్లు సమానంగా వస్తే, లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తారు. ఏదైనా కారణంతో డిప్యూటీ మేయర్ పదవి ఖాళీ అయితే, ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది.

తాజా నిబంధనల ప్రకారం, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు డిపాజిట్ మొత్తాలను కూడా ఖరారు చేశారు. మేయర్, కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.2,500 డిపాజిట్‌గా చెల్లించాలి. అభ్యర్థులు తమ ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు, నేరచరిత్రకు సంబంధించిన వివరాలతో నోటరీ చేసిన అఫిడవిట్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు.

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ (సవరణ) చట్టం–2026 (యాక్ట్ నం. 22) ఆగస్టు 28 నుంచే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం జీవో నం. 210లో పేర్కొంది. పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రిసైడింగ్ అధికారికి అధికారాలు కల్పించారు.

ఇదే సమయంలో, కడప నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన ప్రక్రియను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లను 66కు పెంచుతూ డ్రాఫ్ట్ ప్రతిపాదనలు విడుదల చేసింది. సెప్టెంబర్ 11 వరకు దీనిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి, సెప్టెంబర్ 14న తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ కొత్త నిబంధనలు, మార్గదర్శకాల ఆధారంగానే రాష్ట్రంలో రానున్న పురపాలక ఎన్నికల ప్రక్రియ జరగనుంది.

పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే ఓటు రద్దు

రాష్ట్రంలో నగరపాలక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇటీవల తీసుకొచ్చిన 'ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల సవరణ చట్టం–2026' అమలుకు ఆమోదం తెలుపుతూ ఏకకాలంలో మేయర్, వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణ నియమావళిని ఖరారు చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ జీవో నెం. 210, జీవో నెం. 211 పేరిట రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ చట్టాలకు చేసిన తాజా సవరణలు ఈ ఏడాది ఆగస్టు 28 నుంచే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చినట్లు జీవో 210 ద్వారా ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ సవరణల ఆధారంగానే ఇకపై రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. సవరించిన చట్టం ప్రకారం 'ది ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ మేయర్, వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణ రూల్స్–2026' ను తక్షణమే అమల్లోకి తెస్తూ జీవో 211 ను విడుదల చేశారు. నామినేషన్ల ఘట్టం నుంచి ఓట్ల లెక్కింపు వరకు పకడ్బందీగా ఈ నిబంధనలను రూపొందించారు.

జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.5,000

మేయర్ లేదా కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యర్థులు రూ. 2,500 మేర నామినేషన్ డిపాజిట్ చెల్లించాలి. ఒక అభ్యర్థి ఒకే స్థానానికి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను మాత్రమే దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తమ నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలకు సంబంధించిన పూర్తి వివరాలతో నోటరీ లేదా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేసిన అఫిడవిట్‌ను నామినేషన్‌తో పాటు విధిగా సమర్పించాలి. ప్రతి పోలింగ్ కేంద్రానికి అభ్యర్థులు ఒక పోలింగ్ ఏజెంట్‌తో పాటు ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు.

ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్

ఓట్ల లెక్కింపు కేంద్రంలో ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్, రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద అదనంగా మరో ఏజెంట్‌ను అనుమతిస్తారు. ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఓటరు గుర్తింపును నిర్ధారించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులు తప్పనిసరి. ఎడమ చేతి చూపుడు వేలికి సిరా చుక్క వేయించుకున్న తర్వాతే బ్యాలెట్ పేపర్ ఇస్తారు. దృష్టి లోపం ఉన్నవారు, శారీరక రుగ్మతలతో ఓటు వేయలేని వృద్ధులకు ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వద్దకు సహాయకులను 18 ఏళ్ల నిండిన వారిని అనుమతిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి హెచ్చరికలను బేఖాతరు చేస్తే

అయితే ఒక వ్యక్తి ఒక్కరికి మాత్రమే సహాయకుడిగా వెళ్లాలి. తాము ఓటు గోప్యతను కాపాడతామని సదరు సహాయకుడు డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ నిబంధనలు ఉల్లంఘించినా, ప్రిసైడింగ్ అధికారి హెచ్చరికలను బేఖాతరు చేసినా ఆ ఓటరు నుంచి బ్యాలెట్ పేపర్‌ను వెనక్కి తీసుకునే సర్వాధికారాలు ప్రిసైడింగ్ అధికారికి ఉంటాయి. ఆ బ్యాలెట్ పేపర్ వెనుక 'ఓటింగ్ నిబంధనలు ఉల్లంఘించినందున రద్దు చేయబడింది' అని రాసి ప్రత్యేక కవర్‌లో భద్రపరుస్తారు. కౌంటింగ్ సమయంలో ఆ ఓటును లెక్కించరు.

ఏపీలో జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ
ఇక 28 జడ్పీలు - ఉత్తర్వులు జారీ

రాష్ట్రంలో పాలనా వికేంద్రీకరణలో భాగంగా పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం జిల్లా ప్రజా పరిషత్‌లను పునర్వ్యవస్థీకరించింది. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీల స్థానంలో, కొత్తగా 28 జిల్లా ప్రజా పరిషత్‌లను ఏర్పాటు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. 2025 నవంబర్‌లో కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలతో కలుపుకొని మొత్తం 28 జిల్లాలకు 28 జెడ్పీలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలోని 660 మండల ప్రజా పరిషత్‌లను ఆయా జిల్లాల పరిధిలోని జెడ్పీల కిందకు తీసుకొస?తూ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

కొత్తగా 30 కీలక పోస్టులు సృష్టి

ఉమ్మడి 13 జిల్లాల ప్రాతిపదికన ఏర్పాటైన ప్రస్తుత జెడ్పీల పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది సెప్టెంబర్ 24తో ముగుస్తుంది. ఆ గడువు ముగిసిన తర్వాతే ఈ 28 కొత్త జెడ్పీల ఏర్పాటు అమల్లోకి వస్తుంది. ప్రతి జెడ్పీకి ఒక అడ్మినిస్ట్రేటివ్ అధిపతి ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కొత్తగా 30 పోస్టులను సృష్టించింది. ఇందులో 15 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టులు, మరో 15 డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. వీరి వేతన స్కేలును కూడా నిర్ణయించింది. సీఈవో పోస్టులకు రూ.80,910 -- రూ.1,66,680 వేతన స్కేలును, డిప్యూటీ సీఈవో పోస్టులకు రూ.65,360 -- రూ.1,54,980 వేతన స్కేలును ఖరారు చేస్తూ ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది.

జెడ్పీ పరిధిలో మార్పులు చేసుకునే వెసులుబాటు

ప్రస్తుతం 13 జెడ్పీల్లో ఉన్న మినిస్టీరియల్, ఇతర సహాయక సిబ్బందిని ఆయా జిల్లాల్లోని మండలాల సంఖ్య, పని భారం ఆధారంగా కొత్తగా ఏర్పడే 28 జెడ్పీలకు హేతుబద్ధీకరించి కేటాయిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 660 మండల ప్రజా పరిషత్తులు కొత్త జిల్లాల భౌగోళిక సరిహద్దుల ప్రకారం సంబంధిత జెడ్పీ పరిధిలో పని చేస్తాయి. ఇందుకు సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియను పంచాయతీరాజ్ కమిషనర్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ముమ్ముందు భవిష్యత్తులో ఏదైనా మండలం పునర్వ్యవస్థీకరణ జరిగితే, దానికి అనుగుణంగా జెడ్పీ పరిధిలోనూ మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. కొత్త జిల్లా ప్రజా పరిషత్‌ల ఏర్పాటు, పాలనాపరమైన బదిలీలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగేలా జిల్లా కలెక్టర్లు, ప్రస్తుత జెడ్పీ సీఈవోలు, ఎంపీపీ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో ఆదేశించింది.

దేవాలయాల పరిరక్షణలో ప్రతి హిందువు భాగస్వామి కావాలి
- రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు





గన్నవరం, మహానగర్

దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధిని ప్రతి హిందువు తన బాధ్యతగా భావించి భాగస్వామి కావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గొల్లనపల్లి గ్రామంలోని శ్రీ కార్యసిద్ధి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేయడం శుభపరిణామమన్నారు. గత ప్రభుత్వ పాలనలో హిందూ దేవాలయాల పట్ల నిర్లక్ష్య ధోరణి కనిపించిందని విమర్శించారు. చరిత్రలో చక్రవర్తులు, రాజులు దేవాలయాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, శ్రీకృష్ణదేవరాయలు ఆలయాలకు భూములు దానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో దాతృత్వం తగ్గిపోతోందని, భక్తులు ఆలయాలకు వెళ్లి కోరికలు కోరడంతో పాటు వాటి అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఆలయాలకు వస్త్రాలు, పంచలు, ఇతర కానుకలు సమర్పించే సంప్రదాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. దేవాలయాలను నిర్మించి, అభివృద్ధి చేసిన దాతలను స్మరించుకోవడం భక్తి సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. సమాజంలో దైవభక్తి, పాపభీతి పెరిగినప్పుడే తప్పులు తగ్గుతాయని అన్నారు. ఆలయాల అభివృద్ధికి విరాళాలు అందిస్తున్న దాతలను అభినందించిన యార్లగడ్డ వెంకట్రావు, వారి సేవలకు భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

భక్తుల సౌకర్యాలకే అత్యున్నత ప్రాధాన్యం

- ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరి
- సామాన్య భక్తులకే పెద్దపీట
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ
- దర్శనం సమయాన్ని తెలిపే డిస్‌ప్లేలు, 4డీ డ్రోన్ల నిఘా
- సీపీ రాజశేఖర్‌బాబు
- దసరా శరన్నవరాత్రులకు పకడ్బందీ ఏర్పాట్లు






విజయవాడ, మహానగర్

ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించనున్న 'శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు--2026'కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం సాయంత్రం మహామండపంలోని నూతన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శ్రీ లక్ష్మీశ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే వై. సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి), నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు, నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ ఈఓ వి.కె. శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ గతేడాది కంటే ఈసారి భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. క్యూ లైన్లలో భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్లు, అన్నప్రసాదం అందుబాటులో ఉంచాలని, రద్దీ నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని తెలిపారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ ఉచిత దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ క్యూలైన్లలో ప్రతి 200 నుంచి 300 మీటర్లకు డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసి, దర్శనానికి పట్టే అంచనా సమయాన్ని భక్తులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని తెలిపారు. గతేడాది రెండు హోల్డింగ్ ఏరియాలు ఉండగా, ఈసారి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మూడో హోల్డింగ్ ఏరియాను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. హోల్డింగ్ ఏరియాల్లో డిజిటల్ స్క్రీన్ల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు మ్యాట్రిక్స్ 4డీ డ్రోన్లతో నిరంతర వైమానిక నిఘా, అధునాతన డిజిటల్ సర్వెలెన్స్, ఆటోమేటెడ్ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఘాట్‌రోడ్డులో అనుమతిలేని వాహనాలను కొండపైకి అనుమతించబోమని, ప్రత్యేక స్కానర్లు, సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తామని చెప్పారు. సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా పోలీసు మానవ వనరులను గతేడాదితో పోలిస్తే సుమారు 20 నుంచి 25 శాతం మేర తగ్గించనున్నట్లు తెలిపారు. గతేడాది మూలా నక్షత్రం రోజున సుమారు 2.1 లక్షల మంది భక్తులు వచ్చిన నేపథ్యంలో ఈసారి మరింత రద్దీ ఉండే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కొండపై ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను పూర్తిగా నిషేధించే అంశంపై చర్యలు తీసుకుంటున్నామని, భక్తులకు నాణ్యమైన బబుల్ వాటర్ అందించే విషయాన్ని పరిశీలిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీస్, మున్సిపల్, దేవాదాయ శాఖ, దేవస్థాన పాలకమండలి సమష్టి కృషితో ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు సంతృప్తికరంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, దేవస్థాన ఇంజనీరింగ్, వైదిక కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్‌ను అత్యంత వైభవంగా నిర్వహించాలి
- సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, మహానగర్

దసరా సందర్భంగా విజయవాడలో నిర్వహించనున్న 'విజయవాడ ఉత్సవ్'ను అత్యంత వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆంధ్రప్రదేశ్, విజయవాడ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా, ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ మేరకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు నాయుడును కలిసి 'విజయవాడ ఉత్సవ్'కు సంబంధించిన బుక్‌లెట్‌ను చూపించారు. ఉత్సవాల నిర్వహణ, కార్యక్రమాల రూపకల్పన, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలను సీఎంకు వివరించారు. విజయవాడ నగరానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను ప్రతిబింబించేలా చేపడుతున్న ఏర్పాట్లను తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేలా కార్యక్రమాలను రూపొందించాలని, విజయవాడ ప్రత్యేకతను చాటిచెప్పే విధంగా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. ఉత్సవాల్లో నగర సంస్కృతీ సంప్రదాయాలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం తదితర రంగాలకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన సాంస్కృతిక అనుభూతిని అందించేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ ప్రతిష్టను మరింత పెంచేలా ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మురళి, ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అండర్‌పాస్‌లో వ్యాపారాలతో ట్రాఫిక్ ఇబ్బందులు



ఉంగుటూరు, మహానగర్

మండల పరిధిలోని పెద అవుటపల్లి అండర్‌పాస్ వద్ద రహదారిపై వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. అండర్‌పాస్ ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతోపాటు, వాటికి వచ్చే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. విజయవాడ వైపు నుంచి పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, ఆసుపత్రికి వెళ్లే వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఉద్యోగులు ప్రతిరోజూ ఈ మార్గాన్ని వినియోగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, ఇతర వాహనాలు సైతం అండర్‌పాస్ గుండా సులభంగా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్‌పాస్ ప్రాంతంలో ఆక్రమణలు, రహదారిపై వ్యాపారాలు కొనసాగితే భవిష్యత్తులో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించడంతోపాటు రహదారిపై వాహనాల నిలుపుదలను నియంత్రించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పెద అవుటపల్లి గ్రామ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



గన్నవరం, మహానగర్

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని సెయింట్ జోసెఫ్ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ లిల్లీ అన్నారు. మండలంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు వివిధ అంశాలపై పాఠాలు బోధించారు. విద్యార్థులు ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో పాఠాలు బోధించడంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిస్టర్ లిల్లీ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడంతోపాటు వారి భవిష్యత్తుకు సరైన మార్గనిర్దేశం చేసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేసినప్పుడే ఉన్నత ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జూలీ నిషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు రూ.5 లక్షల విలువైన బంగారు హారం



విజయవాడ, మహానగర్:

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారికి శనివారం పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన భక్తుడు బంగారు ఆభరణాన్ని కానుకగా సమర్పించారు. పాలకొల్లు మండలం భాగ్యేశ్వరం గ్రామానికి చెందిన దొంగ వెంకట త్రిమూర్తి సత్యనారాయణ అమ్మవారికి మొక్కుబడిగా సుమారు రూ.5 లక్షల విలువైన 32 గ్రాముల బంగారు లక్ష్మీతాడును సమర్పించారు. ఈ ఆభరణంలో తెలుపు, ఎరుపు, పచ్చ రంగు రాళ్లను పొదిగారు. ఆలయ ప్రాంగణంలో భక్తుడి చేతుల మీదుగా ఈ కానుకను డిప్యూటీ ఈఓ కిశోర్‌కుమార్ స్వీకరించి అధికారిక రశీదును అందజేశారు. అనంతరం కానుక సమర్పించిన భక్తుడికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులతో ఆశీర్వచనం చేయించిన అనంతరం అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను డిప్యూటీ ఈఓ కిశోర్‌కుమార్ అందజేశారు.

జీడీపీ పెరుగుతోంది.. కానీ..!

2026 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందింది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. ఆర్‌బిఐ 7 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. దీని అర్థం భారతదేశ పనితీరు అంచనాలను మించిపోయింది.అయితే ఈ పెరుగుదలకు సామాన్య ప్రజలు చేసే కొనుగోళ్లు అతిపెద్ద కారణం కాదు రోడ్లు, కర్మాగారాలు, యంత్రపరికరాలు , ఇతర ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడి 11.9 శాతం పెరిగింది. సేవా రంగం 10 శాతం వృద్ధి చెందింది. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఐటీ , వృత్తిపరమైన సేవలు 12.1 శాతం వృద్ధి చెందాయి. పోల్చి చూస్తే, సామాన్య ప్రజల వ్యయం 7.1 శాతం పెరగగా, వ్యవసాయ రంగం కేవలం 3.6 శాతం మాత్రమే పెరిగింది. దీని అర్థం ఏంటంటే, పెద్ద కంపెనీలు, తయారీ , సేవా రంగాలు దేశ వృద్ధిని నడిపించాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు , సాధారణ కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. అందుకే సానుకూల జీడీపీ గణాంకాలు గృహ బడ్జెట్‌లలో ఇంకా స్పష్టంగా ప్రతిబింబించడం లేదు. దేశాలు, పెద్ద కంపెనీలు ఎక్కువ సంపాదించవచ్చు, కానీ అదే వేగంతో కొత్త ఉద్యోగాలు ఉండవు. యంత్రాలు, కొత్త సాంకేతికత తక్కువ మంది కార్మికులతో ఎక్కువ సాధించడానికి సహాయపడతాయి. దీనివల్ల ఉత్పత్తి, జీడీపీ పెరుగుతాయి, కానీ ఉద్యోగార్థులు తక్షణ ప్రయోజనాలను చూడలేరు.గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2011-12ను ప్రాతిపదికగా తీసుకున్న పాత విధానంలో కొందరు రూ.86 లక్షల కోట్లుగా లెక్కించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2022-23 బేస్ ఇయర్‌గా తీసుకున్న కొత్త విధానంలో రూ.88 లక్షల కోట్లుగా లెక్కించారు.ఈ రెండు గణాంకాలను నేరుగా పోల్చడం వల్లే కొందరు విమర్శకులు వృద్ధి రేటు కేవలం 2-2.3 శాతమేనని చెబుతున్నారని నాగేశ్వరన్ పేర్కొన్నారు.అయితే, రెండు వేర్వేరు విధానాల్లో లెక్కించిన గణాంకాలను నేరుగా పోల్చడం సరికాదని స్పష్టం చేశారు.గత ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలను కూడా కొత్త విధానంలో తిరిగి లెక్కించి, ఆ తర్వాత ప్రస్తుత ఏడాది గణాంకాలతో పోల్చాలని సీఈఏ వివరించారు.పాత సిరీస్ కొనసాగి ఉంటే, కొత్త మెథడాలజీ ప్రకారం ఈజ26 ఖి1 జీడీపీ రూ.86 లక్షల కోట్ల కంటే ఎక్కువగా, దాదాపు రూ.90 లక్షల కోట్లకు చేరి ఉండేదని ఆయన అంచనా వేశారు.అలా సవరించిన గత ఏడాది గణాంకంతో ప్రస్తుత ఏడాది రూ.88 లక్షల కోట్ల జీడీపీని పోల్చినప్పుడే వాస్తవికమైన, న్యాయమైన వృద్ధి రేటు తెలుస్తుందని చెప్పారు.అంతేకానీ, భిన్నమైన కొలమానాలతో వచ్చిన రెండు అంకెలను నేరుగా పోల్చి వృద్ధిని అంచనా వేయడం సరైన పద్ధతి కాదన్నారు.గత ఏడాది జీడీపీ గణాంకాల్లో వచ్చిన మార్పులకు కేవలం డబుల్ డిఫ్లేటర్ విధానమే కారణం కాదని నాగేశ్వరన్ తెలిపారు.మెరుగైన కార్యనిర్వహణ, అసంఘటిత రంగానికి మరింత విస్తృతమైన కవరేజీ వంటి పలు అంశాలు కూడా ఇందుకు కారణమని వివరించారు.కొత్త విధానంలో ఈజ26 గణాంకాలు పెరగకపోవడం కూడా గతంలోనే ఆర్థిక వ్యవస్థను సరైన స్థాయిలో కవర్ చేశామనడానికి ఒక సూచనగా ఆయన పేర్కొన్నారు.జీడీపీని లెక్కించేటప్పుడు నామినల్ జీడీపీ, అంటే ధరల మార్పుల ప్రభావంతో కూడిన గణాంకం నుంచి రియల్ జీడీపీని గుర్తించాలి.రియల్ జీడీపీ అంటే ధరల ప్రభావాన్ని తొలగించిన తర్వాత ఉత్పత్తి వాస్తవంగా ఎంత పెరిగిందో చూపించే గణాంకం.ఇందుకోసం ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపయోగించే సాధనాన్నే 'డిఫ్లేటర్' అంటారు.అంతర్జాతీయ సంస్థల సూచనలతోనే డబుల్ డిఫ్లేటర్ విధానం తీసుకోలేదుడబుల్ డిఫ్లేటర్ పద్ధతిని కేవలం అంతర్జాతీయ సంస్థల సూచనల మేరకే భారత్ అనుసరిస్తోందన్న వాదనను నాగేశ్వరన్ తోసిపుచ్చారు.గణాంక నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ విధానాన్ని ఎంచుకున్నామని తెలిపారు.ఇన్‌పుట్, అవుట్‌పుట్ ధరలు వేర్వేరు కారణాల వల్ల మారుతుంటాయని, అందువల్ల వాటి ధరల ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడానికి డబుల్ డిఫ్లేటర్ పద్ధతి సరైనదని వివరించారు.దేశ ఆర్థిక వ్యవస్థ నమోదు చేసిన 7.8 శాతం వృద్ధి రేటు అకస్మాత్తుగా వచ్చినది కాదని నాగేశ్వరన్ స్పష్టం చేశారు.దీనికి ముందే పలు నెలవారీ ఆర్థిక సూచికలు బలమైన వృద్ధి సంకేతాలను ఇచ్చాయని తెలిపారు.జీఎస్టీ వసూళ్లు, ఈ-వే బిల్లుల జారీ, వాహన విక్రయాలు, ఎగుమతుల వృద్ధి, బ్యాంకు రుణాల పెరుగుదల వంటి సూచికలు ఆర్థిక కార్యకలాపాల్లో వేగాన్ని ముందుగానే సూచించాయని పేర్కొన్నారు.ఈ వివరాలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమ్స్, ప్రభుత్వ ఖజానా వంటి విశ్వసనీయ వనరుల నుంచి సేకరించినవేనని చెప్పారు. ఉద్యోగాలపై ప్రభావం చూపే అంశాలు ఒక్కటే కావని, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, స్వచ్ఛందంగా ఉద్యోగం చేయకూడదనే నిర్ణయం వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయని వివరించారు.ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉద్యోగాల వృద్ధికి సంబంధించిన ధోరణులు మెరుగ్గా ఉన్నాయని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు.

సగటు పౌరుడి ఆదాయానికి గండి

పన్నెండేండ్లుగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని పాలనను ఆయన మద్దతుదారులు ఒక అపూర్వ నవశక పరివర్తనగా చిత్రీకరిస్తూ వస్తున్నారు. వారి దృష్టిలో మోదీ ఒక తిరుగులేని సంస్కరణాభిలాషి. పాతకాలపు పాలనా స్తబ్ధతను బద్దలు కొట్టి, రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక వసతుల కల్పనను పరుగులు పెట్టించి, ప్రజాసేవలను డిజిటల్ బాట పట్టించి, అంతర్జాతీయ యవనికపై దేశ ప్రతిష్టను సమున్నతంగా నిలిపిన నేతగా వారు భావిస్తారు. గత రాజకీయాల అనిశ్చితిని తుడిచిపెట్టి, బలమైన, కేంద్రీకృత పాలనా శైలిని ఆయన తీసుకొచ్చారని విశ్వసిస్తారు. మోదీ రాజకీయ ప్రభంజనం ప్రధానంగా రెండు ఆకర్షణీయమైన వాగ్దానాలపై నిలబడింది. ఒకటి 'గుజరాత్ మాడల్' చాటిన ఆర్థిక సమర్థత కాగా, రెండోది 'కనిష్ఠ ప్రభుత్వం గరిష్ఠ పాలన' అనే నినాదం.

విమర్శకుల దృష్టిలో మాత్రం ఇదే దశాబ్దంలో మరో ఆందోళనకర పరిణామం కనిపించింది. కార్యనిర్వాహక అధికారాల మితిమీరిన కేంద్రీకరణ, రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిపై దెబ్బ, భిన్నాభిప్రాయాలను వ్యక్తీకరించే ప్రజాస్వామ్య స్వేచ్ఛ సంకోచం, పౌర సమాజంపై ఒత్తిడి, రాజ్యాంగ రక్షణల క్రమక్షీణత వారిని కలవరపెట్టాయి. ఎన్నేండ్లుగానో ఈ రెండు పక్షాలూ తమకు అనుకూలమైన ఉపన్యాసాలు, ఎంపిక చేసుకున్న గణాంకాలతోనే వాదోపవాదాలు సాగిస్తున్నాయి. సమర్థకులు నూతన రహదారులు, విమానాశ్రయాలు, డిజిటల్ చెల్లింపులు, సంక్షేమ పథకాల విస్తృతిని ప్రదర్శిస్తుంటే, ప్రజాస్వామ్య తిరోగమనం, సంస్థాగత విధ్వంసం, రాజకీయ ధ్రువీకరణ, పెరుగుతున్న ఆర్థిక అసమానతలను మోదీ వ్యతిరేకులు ఎత్తిచూపుతున్నారు.

దేశంలో వాదోపవాదాల హోరులో అసలైన మౌలిక ప్రశ్న మరుగున పడిపోతున్నది. 2013తో పోలిస్తే 2024 నాటికి కొత్త రోడ్లు వచ్చాయా? సాంకేతికత విస్తరించిందా? అనేది మాత్రమే పరిపాలనా దక్షతకు అసలైన కొలబద్ద కాదు. కాలక్రమంలో సహజంగా వచ్చే సాంకేతిక పురోగతి, జనాభా పెరుగుదల, పట్టణీకరణ, ప్రైవేట్ రంగ విస్తరణల వల్ల భారత్ వంటి పెద్ద దేశం ఎలాగైనా ఎంతోకొంత ముందుకు సాగుతూనే ఉంటుంది. ఇక్కడ తేలాల్సిన అసలైన, అత్యంత నిష్మూరమైన ప్రశ్న ఒక్కటే. మోదీ పాలన వల్ల భారతదేశం, పూర్వపు సహజ గమనంలో సాధించాల్సిన ప్రగతి కంటే మెరుగైన ఫలితాలను నిజంగా సాధించగలిగిందా?

ఆర్థికవేత్తలు కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ సంయుక్తంగా వెలువరించిన పరిశోధనా పత్రం 'ప్రామిజెస్: గవర్నెన్స్ అండ్ గ్రోత్ ఇన్ ఇండియా అండర్ మోదీ అండ్ ది బీజేపీ' ఈ ప్రశ్ననే లోతుగా శోధించింది. రాజకీయ నినాదాలను పక్కనపెట్టి, ఒక కచ్చితమైన శాస్త్రీయ నమూనా ద్వారా మోదీ పాలనా తీరును మదింపు చేసింది.

2014కు ముందున్న రాజకీయ, ఆర్థిక గమనం యథావిధిగా కొనసాగి ఉంటే దేశం నేడు ఏ స్థాయిలో ఉండేదో గణాంకాలతో అంచనా వేసి, దాన్ని మోదీ హయాంలోని వాస్తవ ఫలితాలతో తులనాత్మకంగా పోల్చి చూసింది.

కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ విశ్లేషణ ప్రకారం మోదీ పన్నెండేండ్ల పాలన ఒక వాగ్దాన భంగాల కథ. అటు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో, ఇటు ఆర్థిక పురోగతి సాధించడంలో దేశం తన సహజ సామర్థ్యం కంటే వెనుకబడింది. పరిశోధకుల పరిభాషలో చెప్పాలంటే 'భారత్ అత్యంత ప్రమాదకరమైన అధ్వాన స్థితి'కి చేరింది. అంటే ఒకవైపు సంస్థాగత వ్యవస్థలు బలహీనపడటం, మరోవైపు ఆర్థిక ప్రగతి కూడా ఆశించిన స్థాయి కంటే మందగించడం ఏకకాలంలో సంభవించాయి.

అసలైన గీటురాయి

2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు, దేశంలో నడుస్తున్న సాధారణ అభివృద్ధి చక్రాలను అలాగే నడిపిస్తానని మాత్రమే చెప్పలేదు. సమూల పరివర్తన తీసుకొస్తానని హామీ ఇచ్చారు. తన దృఢమైన నాయకత్వం, సత్వర నిర్ణయాలు, అధికార యంత్రాంగపు జాప్యాన్ని తగ్గించడం, పారిశ్రామిక అనుకూల వాతావరణం దేశ రూపురేఖలనే సమూలంగా మార్చేస్తాయని ప్రచారం చేశారు. గత పాలకులు అరవై ఏండ్లలో చేయలేనిది తాము అరవై నెలల్లో సాధిస్తామని ప్రకటించారు.

పరిపాలనా పరమైన హామీ కూడా అంతే ప్రతిష్ఠాత్మకమైనది. 'కనిష్ఠ ప్రభుత్వం గరిష్ఠ పాలన' ద్వారా పాలనలో సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనం ఇనుమడిస్తాయని ప్రజలు ఆశించారు. బలమైన రాజకీయ నాయకత్వం వస్తే వ్యవస్థలు పటిష్ఠమవుతాయని, దాంతో పాటే ఆర్థికాభివృద్ధి కూడా శరవేగంగా పరుగులు తీస్తుందన్న ఆశల మధ్యనే మోదీ అధికారాన్ని చేపట్టారు. ఈ వాగ్దానాలనే గీటురాయిగా తీసుకొని కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ పరిశోధన చేశారు. 2014 తర్వాత భారత్ ఎదిగిందా లేదా అనేది వారి ప్రశ్న కాదు, దేశం కచ్చితంగా ఎదిగింది. కానీ, అంతకుముందున్న సహజమైన వేగం కొనసాగి ఉంటే సాధించాల్సిన దానికంటే వేగంగా, సమర్థంగా ఎదిగిందా లేదా అనేదే వారు పరిశీలించారు. దీనికోసం వారు గణాంక శాస్త్రంలో పేరొందిన 'సింథటిక్ కంట్రోల్ మెథడ్'ను ఉపయోగించారు. భారత్‌ను ఏదో ఒక దేశంతో మాత్రమే పోల్చకుండా, 2014కు ముందు భారతదేశ ఆర్థిక, పాలనా పరిస్థితులతో దగ్గరి పోలికలున్న పలు దేశాల సూచికలను కలిపి భారత్‌ను ఒక నమూనాగా సృష్టించారు. ఈ ఆర్థిక నమూనాలో ఇథియోపియా, చైనా, బంగ్లాదేశ్‌కు ప్రధాన వాటాలు ఉండగా, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ వంటి ఇతర దేశాల గణాంకాలూ ఉన్నాయి.

ఈ దేశాలు రాజకీయంగా భారత్‌తో సమానమని చెప్పడం వీరి ఉద్దేశం కాదు, 2014 కంటే ముందు భారత్ ఏ గమనంలో సాగిందో అదే రీతిని పునఃసృష్టించగల ఒక ప్రామాణిక నమూనాను తయారు చేయడమే వీరి లక్ష్యం. 2014 వరకు ఈ నమూనా భారతదేశ వాస్తవ గమనంతో అచ్చంగా సరిపోయింది. అయితే 2014 తర్వాత మాత్రం వాస్తవ భారతదేశం, ఈ నమూనా అంచనా వేసిన స్థాయి కంటే దిగజారడం మొదలైంది. ఆ వ్యత్యాసమే మోదీ పాలనలోని డొల్లతనాన్ని బహిర్గతం చేసింది.

దేశం చేరిన అధ్వాన తీరం

మోదీ దశాబ్దపు పాలనను విశ్లేషించేందుకు పరిశోధకులు నాలుగు పరిణామాలతో కూడిన ఒక సూత్రాన్ని ప్రతిపాదించారు. మొదటిది, మెరుగైన పాలనతోపాటు అద్భుతమైన ఆర్థిక పురోగతిని ఏకకాలంలో సాధిస్తామన్న మోదీ వాగ్దానం. రెండోది, ప్రజాస్వామ్య స్వేచ్ఛ కాస్త తగ్గినా, కండ్లు చెదిరే స్థాయిలో ఆర్థిక ప్రగతి సాధించడంతో సరిపెట్టుకోవడం. మూడోది, వ్యవస్థాగత నియమాలు బాగుపడినా ఆర్థికవృద్ధి నెమ్మదించే ప్రజాస్వామ్య వైరుధ్యం. ఇక నాలుగోది ప్రజాస్వామ్య వ్యవస్థలూ కూలిపోవడం, అదే సమయంలో ఆశించిన స్థాయిలో ఆర్థికవృద్ధి కూడా రాకపోవడం అనే అధ్వాన స్థితి.

కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ పరిశోధన ప్రకారం భారత్ సరిగ్గా ఈ నాలుగో క్యాటగిరీ అయిన అధ్వానస్థితిలోనే కూరుకుపోయింది. 'గరిష్ఠ పాలన' దక్కలేదు, పాలనను ఉక్కుపాదంతో నడిపించినా ఊహించిన ఆర్థిక ఫలితాలూ రాలేదు. ఇందులోని అత్యంత కీలకమైన సత్యం ఏమిటంటే, 'ప్రజాస్వామ్య విలువలను కాస్త పక్కనబెడితేనే దేశం ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతుంది' అనుకున్న బలమైన నాయకత్వ సిద్ధాంతం ఘోరంగా విఫలమైంది. విలువలను బలిపెట్టినా దేశానికి దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనం ఏమాత్రం దక్కలేదు.

వ్యవస్థాగత విధ్వంసం

పాలనా ఫలితాల విశ్లేషణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వి-డెమ్ డాటాబేస్ ఆధారంగా ఎన్నికల ప్రజాస్వామ్యం, ఉదారవాద విలువలు, కార్యనిర్వాహకవర్గంపై న్యాయ-శాసనసభల నియంత్రణలు, రాజకీయ అవినీతి, భావప్రకటన స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, సమాన రక్షణ వంటి పది కీలక సంస్థాగత సూచికలను పరిశోధకులు మదింపు చేశారు. 2014 తర్వాత పదేండ్ల కాలానికి సంబంధించి లెక్కించిన వంద ఫలితాలలో, ఏకంగా తొంభై ఆరు సందర్భాల్లో భారతదేశం తన నమూనా అంచనా కంటే వెనుకబడింది. అందులో తొంభై రెండు ఫలితాలు అత్యున్నత గణాంక విశ్వసనీయతతో కూడిన స్పష్టమైన క్షీణతను నమోదు చేశాయి.

ఈ పతనం ఏదో ఒక రంగానికో లేదా సంస్థకో పరిమితం కాలేదు. 2013 నాటి ప్రాథమిక స్థాయితో పోలిస్తే ఎన్నికల ప్రజాస్వామ్యంలో అరవై శాతానికి పైగా, ఉదారవాద ప్రజాస్వామ్య స్వేచ్ఛలో దాదాపు 70 శాతం, భావప్రకటనా స్వేచ్ఛలో 56 శాతం పతనం నమోదైంది. మతస్వేచ్ఛలో అత్యంత దారుణంగా 168 శాతానికి పైగా క్షీణత కనిపించగా, చట్టం ముందు సమానత్వం, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ, ప్రభుత్వంపై పార్లమెంట్ నియంత్రణ, చట్టపరమైన సమాన రక్షణ, న్యాయవ్యవస్థ స్వతంత్రత వంటి అంశాలన్నీ తీవ్రమైన క్షీణతను చవిచూశాయి.

ఈ ఫలితాలను బట్టి చూస్తే ప్రజాస్వామ్యం దెబ్బతింటున్నదన్న విమర్శలు కేవలం రాజకీయ ఆరోపణలో లేక విదేశీ పక్షపాతమో కావని, వాస్తవ గణాంకాలే అనే నిజాన్ని రుజువు చేస్తున్నాయని స్పష్టమవుతున్నది. ఇందులో అన్నిటికంటే రాజకీయంగా ఇబ్బందికరమైన అంశం ఏంటంటే అవినీతి గురించిన విశ్లేషణ. స్వచ్ఛమైన, అవినీతిరహిత పాలన అందిస్తాననే నినాదంతోనే మోదీ 2014లో పాలనా పగ్గాలు చేపట్టారు. కానీ కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ అధ్యయనం ప్రకారం రాజకీయ అవినీతి సూచిక నమూనా అంచనాల కంటే దాదాపు 47 శాతం దిగజారింది. మోదీ కంటే ముందు అవినీతి లేదా అంటే కచ్చితంగా ఉండేది. కానీ మోదీ వచ్చాక దేశం మునుపటి కంటే స్వచ్ఛంగా మారిందా అనేదే ప్రశ్న. అలా జరుగలేదని లెక్కలు చెప్తున్నాయి. అధికారం మొత్తం ఒకరి చేతుల్లోనే కేంద్రీకృతమైతే అవినీతి దానంతటదే అంతం కాదన్న సత్యాన్ని ఈ విషయం స్పష్టంచేస్తున్నది. అధికారాన్ని కేంద్రీకరించడం వల్ల ఇతర అధికార కేంద్రాలు అణచివేతకు గురికావొచ్చు కానీ అవినీతి సమసిపోదు. అది మరింత గుంభనంగా, పారదర్శకత లేకుండా తన రూపాన్ని మార్చుకుంటుంది.+వశీస్త్రతీఖుజూష్టఱఖ =వటవతీవఅఎవ

సగటు పౌరుడి ఆదాయానికి గండి

మోదీ పాలనకు అసలైన కొలబద్ద ఆర్థిక సమర్థత. గుజరాత్ మాడల్ ఊపుతో దేశాన్ని తిరుగులేని స్థాయికి చేరుస్తామని మోదీ అన్నారు. పరిశోధకులు దీనిని వాస్తవ తలసరి ఆదాయం ఆధారంగా పరీక్షించారు. 2014లో పాలన చేపట్టిన కొంత కాలానికే భారత్ తన సహజ నమూనా కంటే వెనుకబడటం ప్రారంభమైంది. కాలక్రమేణా ఈ అంతరం పెరుగుతూ వచ్చింది. అధ్యయన కాలం ముగిసే నాటికి, సగటు భారతీయుడి వాస్తవ తలసరి ఆదాయం ఉండాల్సిన దానికంటే పది శాతం తక్కువగా నమోదైంది. సామాన్య పరిభాషలో చెప్పాలంటే, పాత ఆర్థిక గమనం యథావిధిగా కొనసాగి ఉంటే సగటు భారతీయుడికి రావాల్సిన వార్షిక ఆదాయంలో దాదాపు వెయ్యి డాలర్లు, అంటే సుమారు ఎనభై వేల రూపాయల కంటే ఎక్కువ గండి పడింది. దీనర్థం, దేశం వెనక్కి నడిచిందని కాదు, దేశం ఎదిగింది. కానీ ఎంత ఎదగాల్సి ఉన్నదో అంతగా ఎదగలేకపోయింది. కంటికి కనిపించే పెరుగుదల వేరు, చేజారిన సామర్థ్యం వేరు. చేజారిన అవకాశాలు కంటికి కనిపించని నష్టాలు : పరిశ్రమ మూతపడితే కనిపిస్తుంది, ఆర్థిక సంక్షోభం వస్తే అర్థమవుతుంది. కానీ సంపాదించలేకపోయిన ఆదాయాన్ని ఎవరూ చూపించలేరు, సృష్టించలేకపోయిన ఉద్యోగాలు అధికారిక లెక్కల్లోకి రావు. రాలేకపోయిన పెట్టుబడులకు ఆనవాళ్లు ఉండవు. కానీ నిజమైన నష్టం అక్కడే దాగి ఉన్నది. వ్యవస్థలో అప్పటికే ఉన్న సహజ వేగం కంటే నాయకత్వం అదనంగా సాధించిన ప్రగతి ఏమిటన్నదే ఇక్కడ అసలైన లెక్క.

కొవిడ్ సాకు నిలువదు

ఆర్థిక వైఫల్యాలన్నింటికీ కొవిడ్‌నే సాకుగా చూపడం సహజం. కానీ ఈ వాదనను కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ తోసిపుచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థ కుంటుపడటం కొవిడ్‌కు ఎంతో ముందే మొదలైంది. సంక్షోభాన్ని కొవిడ్ మరింత తీవ్రం చేసి ఉండవచ్చు కానీ, అసలు లోటు అంతకుముందే మొదలయ్యింది. కొవిడ్ విపత్తు ప్రపంచం మొత్తానికి వచ్చింది తప్ప ఒక్క భారత్‌కే పరిమితం కాలేదు. ఆ కాలాన్ని మినహాయించినా కూడా ఆర్థిక మందగమనం స్పష్టంగా కనిపించింది. అలాగే పెద్ద నోట్ల రద్దు అనేది అనుకోకుండా జరిగిన విపత్తు కాదు. చలామణిలో ఉన్న 86 శాతం కరెన్సీని రాత్రికి రాత్రే రద్దు చేయడం అనేది ప్రభుత్వం స్వయంగా తీసుకున్న విధానపరమైన నిర్ణయం. విజయాలకు క్రెడిట్ తీసుకునే పాలకులే తప్పుడు నిర్ణయాల వినాశకర ఫలితాలకూ బాధ్యత వహించాలి. నోట్ల రద్దు తెచ్చిన నష్టం కచ్చితంగా ప్రభుత్వ ఆర్థిక ఖాతాలోనే పడుతుంది. అదనంగా, 2015 తర్వాత జీడీపీ గణన పద్ధతుల్లో వచ్చిన మార్పుల వల్ల వృద్ధి రేటును కాస్త పెంచి చూపించారనే విమర్శలూ ఉన్నాయి. అదే గనుక నిజమైతే, ఈ పరిశోధన చూపించిన 10 శాతం లోటు వాస్తవంలో అంతకంటే ఎక్కువే ఉండొచ్చు.ఖీఅఱుస్రవఎవత్

రాజకీయ మర్మం

వ్యవస్థలు దెబ్బతిని, ఆర్థిక వ్యవస్థ తన సామర్థ్యం కంటే నెమ్మదించినా మోదీ, బీజేపీ ఎన్నికల్లో ఎలా గెలుస్తూ వచ్చారనే ప్రశ్నకు పరిశోధకులు ఎన్నికల గణితం, విపక్షాల అనైక్యతను కారణంగా చూపారు. 2014లో బీజేపీకి జాతీయ స్థాయిలో వచ్చింది కేవలం 31 శాతానికి పైగా ఓట్లే. అయినప్పటికీ మొదటి స్థానంలో నిలిచిన వారే విజేతగా నిలిచే ఎన్నికల విధానం వల్ల, విపక్షాల ఓట్లు చీలిపోవడంతో ఆ తక్కువ ఓట్ల శాతమే పార్లమెంటులో పూర్తి మెజారిటీగా మారింది. 2014లో లోక్‌సభలో గెలిచిన ఎంపీల్లో 61 శాతం మందికి కనీసం 50% ఓట్లు కూడా రాలేదు. 2024 ఎన్నికలు ఈ రాజకీయ మర్మాన్ని మరింత స్పష్టంగా చాటాయి.

దేశవ్యాప్తంగా బీజేపీ ఓట్ల శాతం పెరిగినప్పటికీ, సొంతంగా మెజారిటీ సాధించలేకపోయింది. కారణం ఒక్కటే, ఇండి కూటమి పేరుతో విపక్షాలు సమన్వయంతో పోటీ చేసి, బీజేపీ వ్యతిరేక ఓటును చీలిపోకుండా ఆపగలిగాయి. ఉత్తరప్రదేశ్ ఇందుకు ప్రబల నిదర్శనం. అక్కడ బీజేపీ తన ఓటు బ్యాంకును కాపాడుకున్నప్పటికీ, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయడంతో బీజేపీ సీట్లు మాత్రం గణనీయంగా పడిపోయాయి. దీనిద్వారా తేలిన సత్యం ఏంటంటే, ఎక్కువ ఓట్లు వచ్చినంత మాత్రాన సీట్లు రావాలని లేదు. విపక్షాలు చీలినప్పుడు సాధారణ అధిక్యతతోనూ తిరుగులేని అధికారం దక్కుతుంది. అవే విపక్షాలు ఏకమైనప్పుడు అదే ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ మైనారిటీకి పడిపోవాల్సి వస్తుంది.

ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై జేపీసీ

న్యూఢిల్లీ : విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026 పై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. బిహార్ బీజేపీ ఎంపీ, లోక్‌సభలో బీజేపీ చీఫ్ విప్ డాక్టర్ సంజయ్ జైస్వాల్ ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో కూడిన జాయింట్ కమిటీ, ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు, పలు అంశాలను పరిశీలించనుంది. ఈఅఖీం జాయింట్ పార్లమెంటరీ కమిటీలో పలు రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలు ఉన్నారు. బీజేపీ నుంచి డాక్టర్ సంజయ్ జైస్వాల్, భర్తృహరి మహతాబ్, తేజస్వి సూర్య, కమలేష్ జంగ్డే, ముఖేష్ కుమార్ చంద్రకాంత్ దలాల్, డాక్టర్ నిషికాంత్ దూబే, విష్ణు దయాళ్ రామ్, అనంత్ నాయక్, అరవింద్ ధర్మపురి సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్ తరపున ఆంటో ఆంటోనీ, కెప్టెన్ విరియాటో ఫెర్నాండెజ్, మహ్మద్ హమ్దుల్లా సయీద్, కాళీ చరణ్ ముండా ఉన్నారు.ఈ ప్యానెల్‌లోని ఇతర లోక్‌సభ ఎంపీలలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన జియా-ఉర్-రెహమాన్, టీఎంసీకి చెందిన కళ్యాణ్ బెనర్జీ, డీఎంకేకు చెందిన ఎ. రాజా, టీడీపీకి చెందిన లావు శ్రీ కృష్ణ దేవరాయలు, శివసేనకు చెందిన నరేష్ గణపత్ మస్కే, జేడీ(యూ)కి చెందిన కౌశలేంద్ర కుమార్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్‌చంద్ర పవార్, ఎన్‌సీపీ-ఎస్పీకి చెందిన సుప్రియా సూలే, ఐయూఎంఎల్‌కు చెందిన ఈటీ మహమ్మద్ బషీర్ ఉన్నారు.జాయింట్ కమిటీలో రాజ్యసభ ఎంపీలు సి.సదానందన్ మాస్టర్, హర్షవర్ధన్ శ్రింగ్లా, ఉజ్వల్ దేవ్‌రావ్ నికమ్, డాక్టర్ అల్కా గుర్జార్, సత్ పాల్ శర్మ, ప్రఫుల్ పటేల్, సంజయ్ కుమార్ ఝా, క్రిస్టోఫర్ మాణికం, డాక్టర్ మేనకా గురుస్వామి, పి.విల్సన్ ఉన్నారు.

జాబితా

మొత్తం - 31 ఎంపీలు
లోక్‌సభ ఎంపీలు - 21
రాజ్యసభ ఎంపీలు - 10
ఎన్‌డీఏ: 19 మంది ఎంపీలు (బీజేపీ - 14, జేడీయూ - 2, టిడిపి - 1, శివసేన - 1, ఎన్సీపీ - 1).
విపక్షాలు: 12 మంది ఎంపీలు (కాంగ్రెస్ - 5, తృణమూల్ కాంగ్రెస్ - 2, డీఎంకే - 2, ఎస్పీ - 1, ఐయూఎంఎల్ - 1, ఎన్‌సీపీ-శరద్ పవార్ - 1విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం భారత్ లోకి విదేశీ నిధులు, వస్తువులు, విదేశీ సెక్యూరిటీల రాక, వినియోగాన్ని నియంత్రిస్తుంది. జాతీయ భద్రత, శాంతిభద్రతలు, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా వచ్చే విదేశీ నిధులను ఉపయోగించకుండా చూడటమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుత ఈఅఖీం చట్టం 2010 నాటిది, దీనిని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తుంది. ఈ చట్టం ప్రకారం, విదేశీ విరాళాలు స్వీకరించడానికి ఎన్జీఓలు, ట్రస్టులు, సంస్థలు, ఇతర అర్హతగల సంస్థలకు ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ లేదా అనుమతి అవసరం. వారు స్వీకరించిన విదేశీ నిధుల వినియోగం, అకౌంటింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రభుత్వానికి అందించాలి.

ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కీలక మార్పులు

సంస్థాగతంగా మరింత బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేసింది. దేశంలోని పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ (ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ) ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా పీవీ మోహన్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. మాణికం ఠాకూర్ తమిళనాడుకు వెళ్లడంతో ఆంధ్రప్రదేశ్ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ పదవి ఖాళీ అయింది. దీంతో ఆ స్థానంలో మోహన్‌ను ఎంపిక చేసింది. మరోవైపు వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పంజాబ్ రాష్ట్రానికి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీగా రాజస్థాన్ కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్‌ను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త నియామకాలు తక్షణమే అమల్లోకి వచ్చేలా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నియమించారని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులు గా సుఖ్‌దేవ్ భగత్‌ను ఎంపిక చేశారు. మరికొందరిని ఇటీవల కాలంలో పార్టీ బాధ్యులుగా నియమించినట్లు కాంగ్రెస్ ప్రకటనలో పేర్కొంది. పంజాబ్ రాష్ట్రంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఇక్కడ కాంగ్రెస్ ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. పంజాబ్ శాసనసభ గడువు 2027 మార్చి 16తో ముగియనుండగా, ఆలోపే అంటే వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముందుగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని పుంజుకునేలా చేసేందుకు, వ్యూహాలు రచించడానికి సీనియర్ నేత సచిన్ పైలట్‌ను ఏఐసీసీ వ్యవహారాల బాధ్యులుగా నియమించింది. ప్రస్తుతం పంజాబ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఉద్వాసన ఎదురైంది. ఇప్పుడు సచిన్ పైలట్ పంజాబ్ కాంగ్రెస్ బాధ్యతలు చూసుకోనుండగా, బఘేల్‌ను అసోం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. సచిన్ పైలట్ విషయానికి వస్తే ఈయన పార్టీలో కీలక నాయకుల్లో ఒకరు. గతంలో రాజస్థాన్‌కు ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇంకా రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. వివిధ మంత్రిత్వ శాఖల్లో పనిచేశారు. ప్రస్తుతం పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉంది.

మరోవైపు గుజరాత్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీగా సీనియర్ నాయకుడు రణదీప్ సింగ్ సుర్జేవాలాను పార్టీ నియమించింది. గుజరాత్‌లో వచ్చే ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ దాదాపు 30 ఏళ్లు గా కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉంది. ఇక్కడ తిరిగి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఆయన కృషి చేయాల్సి ఉంటుంది. ఇటీవలే అధికార మార్పిడి జరిగిన కర్ణాటకలోనూ ఏఐసీసీ వ్యవహారాల బాధ్యతలను రణదీప్ సుర్జేవాలా చూసుకోనున్నారు. సిరివెల్ల ప్రసాద్‌ను మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఇక ఇప్పటివరకు పార్టీ జనరల్ సెక్రటరీ/ఇన్‌ఛార్జ్‌లుగా పనిచేసి, బాధ్యతల నుంచి తప్పుకుంటున్న జితేంద్ర సింగ్, రమేశ్ చెన్నితాల, మాణికం ఠాకూర్‌ల సేవలను పార్టీ అభినందిస్తోందని వేణుగోపాల్ అన్నారు. మరోవైపు ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా ముకుల్ వాస్నిక్ కొనసాగుతారని ప్రకటనలో కాంగ్రెస్ పేర్కొంది.



కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లు వీరే

ఆంధ్రప్రదేశ్– పీవీ మోహన్
పంజాబ్– సచిన్ పైలట్
అసోం– భూపేశ్ బఘేల్ (ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి)
మహారాష్ట్ర– సిరివెల్ల ప్రసాద్
గుజరాత్– రణ్‌దీప్ సుర్జేవాలా
ఉత్తర్‌ప్రదేశ్– రాజేంద్ర పాల్ గౌతమ్
హరియాణా– సంజయ్ దత్ (2026 జూన్‌లో నియామకం)
ఒడిశా– లాల్జీ దేశాయ్ (2026 జూన్‌లోనే నియామకం)
తమిళనాడు– గులామ్ అహ్మద్ మీర్ (2026 జులైలో నియామకం)
బంగాల్– ప్రకాశ్ జోషి (2026 జులైలో నియామకం)

రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సహా అదే విధంగా ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్టానం సంస్థాగతంగా మార్పులు చేస్తున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడం సహా పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడం, ఆయా రాష్ట్రాల నాయకత్వంతో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను దూకుడుగా ముందుకు తీసుకెళ్లడం, ఎన్నికల వేళ వ్యూహాల్ని అమలు చేయడం వంటి పలు అంశాలపై పార్టీ ఇన్‌ఛార్జ్‌లు దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

అసెంబ్లీ ఎన్నికల వేళ 4 రాష్ట్రాల్లో జనగణన

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (=+× – రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ స్వీయ గణన ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని నారాయణ్ తెలిపారు. 2027 జనవరి 5 నుంచి 9 వరకు దీనికి సంబంధించి రివిజనల్ రౌండ్ నిర్వహిస్తామన్నారు. ఈ రివిజనల్ రౌండ్‌లో సవరణలకు అవకాశం ఉంటుందన్నమాట. ఇక్కడ అవసరమైన మార్పులు లేదా ధ్రువీకరణ ప్రక్రియలు వంటివి నిర్వహించే అవకాశం ఉంటుంది. ఉత్తరాఖండ్‌లో మంచుతో కప్పి ఉండే ప్రాంతాల్లో మాత్రం పైన షెడ్యూల్ ప్రకారం జన గణన ప్రక్రియ ఉండదని నారాయణ్ స్పష్టం చేశారు.

ఈ నోటిఫికేషన్ ప్రకారం ఉత్తరాఖండ్ మంచు ప్రాంతాలు మినహా ఈ నాలుగు రాష్ట్రాల్లో 2027 జనగణనకు (సెన్సస్ 2027) రిఫరెన్స్ డేట్‌గా 2027, జనవరి 5 అర్ధరాత్రి 12 గంటలుగా (00:00 ఎతీం) నిర్ణయించారు. అంటే ఈ తేదీ, సమయాలను ప్రామాణికంగా తీసుకొని ఆ లోపే జనగణన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మరోవైపు లద్దాఖ్ సహా మంచుతో కప్పి ఉండి రవాణాకు అనుకూలించని జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం, అలాగే మంచుతో కప్పబడి ఉండే హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాలకు జనగణనకు రిఫరెన్స్ డేట్‌ను 2026, అక్టోబర్ 1 గా నిర్ణయించారు. అంటే ఈ ప్రాంతాల్లో ముందుగానే సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జనగణన నిర్వహించనున్నట్లు గత నెలలో =+× గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్ట్ 17– 31 మధ్యే ఇక్కడ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ జరిగింది. ఈ ప్రాంతాల్లో శీతాకాలంలో పరిస్థితులు అనుకూలించని కారణంగా ముందుకు జరిపారు. ఈ ప్రాంతాల్లోని ప్రత్యేక భౌగోళిక వాతావరణ పరిస్థితుల నేపథ్యంలోనే ఇతర సాధారణ ప్రాంతాలతో కలిపి ఒకేసారి జనాభా లెక్కలు నిర్వహించడం కష్టం కావడంతో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించారు.



కేంద్ర ప్రభుత్వం గతంలో 2025 జూన్ నెలలో విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం– పైన చెప్పిన మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాలకు మినహాయించి దేశంలోని మిగతా అన్ని ప్రాంతాలకు 2027 మార్చి 1 ని రిఫరెన్స్ డేట్‌గా నిర్ణయించింది. ఇక గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల శాసనసభల గడువు 2027 మే నాటికి ముగుస్తుంది. అంటే ఆలోపే ఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తీరా ఎన్నికల వేళ జనగణన నిర్వహిస్తే పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల్ని మోహరించడం కష్టమని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఈ రాష్ట్రాల్లో సెన్సస్ ప్రక్రియను ముందుకు జరిపారు. ఇవి కాకుండా దేశంలోని మిగతా రాష్ట్రాల్లో జనాభా గణన ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ జనగణన ప్రక్రియలో కుటుంబంలోని వ్యక్తులకు సంబంధించిన వివరాలు సహా పలు సామాజిక, ఆర్థిక వివరాల్ని అధికారులు సేకరిస్తారు.

కొవిడ్ వ్యాప్తి కారణంగా వాయిదా

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదో సారి జనగణన నిర్వహిస్తుండగా, ఈ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. ఫస్ట్ ఫేజ్‌లో ఇళ్ల జాబితా, గణన ఉంటుంది. రెండో దశలో జనాభా లెక్కల్ని సేకరిస్తారు. ప్రస్తుత 2027 జనగణన ప్రక్రియ 2021లోనే జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్–19 వ్యాప్తి కారణంగా ఇది వాయిదాపడింది. ఈ సెన్సస్ ప్రక్రియ నిర్వహణ కోసం కేంద్రం భారీగా ఖర్చు చేస్తోంది. ఏకంగా రూ. 11,718 కోట్ల విడుదలకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది.

మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది

ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అయితే ప్రస్తుతం విశ్వసనీయత సంక్షోభం మీడియా రంగం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యగా మారిందని వ్యాఖ్యానించారు. అన్ని రంగాల్లోనూ క్రెడిబిలిటీ తగ్గుతున్న ప్పటికీ, మీడియా రంగంలోనే ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఐఐఎం నాగ్‌పూర్ మీడియా కాన్‌క్లేవ్ 2026లో 'మీడియా, లీడర్‌షిప్ అండ్ ది న్యూ వరల్డ్ ఆర్డర్' అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి, బిజినెస్ స్టాండర్డ్ ఎడిటోరియల్ డైరెక్టర్ ఏకే భట్టాచార్య, బ్లిట్జ్ ఇండియా మీడియా గ్రూప్ ఛైర్మన్, ఎడిటర్ ఇన్ చీఫ్ దీపక్ ద్వివేది తదితరులు హాజరయ్యారు. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ మని గడ్కరీ అన్నారు. ప్రజాస్వామ్యంలో మంచి మార్పు రావా లంటే దాని కీలక వ్యవస్థలు సమర్థంగా పనిచేయాల్సిన అవ సరం ఉందని నొక్కిచెప్పారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వా మ్యంలోని నాలుగు స్తంభాలైన శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా తమ బాధ్యతల్ని చక్కగా నిర్వర్తించాలి. ప్రజాస్వామ్యం పురోగతికి, అభివృద్ధికి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయవ్యవస్థతో పాటు స్వతంత్ర మీడియా కూడా అవసరమని అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని గడ్కరీ పేర్కొన్నారు.

రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమే

ప్రజాస్వామ్యానికి రాజకీయాలు, రాజకీయ పార్టీలు అతిపెద్ద బలమని కేంద్ర మంత్రి తెలిపారు. అయితే రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు, సిద్ధాంతపరమైన విభేదాలు ఉండటం సహజమేనని గడ్కరీ చెప్పారు. 'ఒక వ్యక్తి లేదా పార్టీ తాను నమ్మిన సిద్ధాంతం పట్ల నిబద్ధతతో ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి సామాజిక, ఆర్థిక, విద్య సహా పలు అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడం కూడా అవసరమే. ప్రజలకు ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన ఉండటంతో పాటు వాటి పట్ల నిబద్ధత కలిగి ఉండటం కూడా చాలా ముఖ్యం' అని గడ్కరీ స్పష్టం చేశారు.



మీడియా క్రెడిబిలిటీనే బాగా పడిపోయింది

21వ శతాబ్దంలో ఏ రంగానికైనా విశ్వసనీయత, మంచి పేరు (గుడ్‌విల్), నిజాయతీనే అతిపెద్ద పెట్టుబడులు అని గడ్కరీ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో క్రెడిబిలిటీ కొంత తగ్గిందని, కానీ మీడియాలో మాత్రం విశ్వసనీయత చాలా ఎక్కువగా పడిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఇక్కడ అన్ని మీడియా సంస్థలు తమ విశ్వసనీయత కోల్పోయాయని తాను చెప్పట్లేదని స్పష్టం చేశారు. మీడియా తన విశ్వసనీయతను తిరిగి ఎలా సాధించాలనే దానిపై ఆలోచించాల్సిన అవసరం ఉందని గడ్కరీ సూచించారు. గతంలో కొన్ని పత్రికలు సహా మీడియా సంస్థలు ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో తామే నిర్ణయించగలమన్న స్థాయిలో మాట్లాడేవని గడ్కరీ తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అయితే సోషల్ మీడియా రాకతో పరిస్థితి పూర్తిగా మారి పోయిందని అన్నారు. మీడియాతో పాటు రాజకీయాల్లో కూడా విశ్వసనీయత సంక్షోభం ఉందని పేర్కొన్న గడ్కరీ, అన్ని రంగా ల్లోనూ సమస్య ఉన్నప్పటికీ మీడియా రంగంలో క్రెడిబిలిటీ సంక్షోభమే అతిపెద్ద సమస్య అని అభిప్రాయపడ్డారు. అందుకే దీనిని తిరిగి తెచ్చుకునేందుకు జర్నలిస్టులు ప్రజలు, సమాజం, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వార్తలు రాయాలని గడ్కరీ సూచించారు. జర్నలిజంలో నాణ్యతతో పాటు వృత్తి విలువలను కాపాడుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో తమ విశ్వసనీయతను కాపాడుకుంటూ, వృత్తి ప్రాథమిక విలువలను గౌరవించే మీడియా సంస్థలు, జర్నలిస్టులే నిలదొక్కుకుంటారని గడ్కరీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, సామాజిక న్యాయం, జాతీయ ప్రయోజనాలను కాపాడటం, ప్రజలకు వాస్తవ సమాచారం చేరవేయడం వంటి అంశాలపై మీడియా దృష్టి పెట్టాలని సూచించారు. ఇవన్నీ భారత్‌ను విశ్వగురుగా ఎదిగేందుకు దోహదపడతాయని గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన ఐఐఎం నాగ్‌పూర్ డైరెక్టర్ డాక్టర్ భీమరాయ మెత్రి– దేశ అభివృద్ధిలో నేటి యువత కీలక పాత్ర పోషించనుందని అన్నారు.

డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థుల్లో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, అధిక స్క్రీన్ టైమ్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. పిల్లలను కేవలం చదువులోనే కాకుండా వారి ప్రవర్తన, రోజువారీ జీవితం, ఆసక్తులు, అలవాట్ల పరంగా కూడా గమనించాలని చెప్పారు. క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులతో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిల్లల భవిష్యత్తు, విద్యా విధానం, డ్రగ్స్, స్క్రీన్ టైమ్ వంటి అంశాలపై వారితో చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను శనివారం విడుదల చేశారు. "ఉపాధ్యాయులు పుస్తకాలు, సిలబస్‌కే పరిమితం కాకుండా విద్యార్థుల జీవితాల్లో భాగం కావాలి. పిల్లల్లో సహజంగా ఉండే ఆసక్తి, తెలుసుకోవాలనే కుతూహలాన్ని గుర్తించి దాన్ని సరైన దిశలో మళ్లించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. పిల్లల బాల్యాన్ని కోల్పోకుండా చూడటం ఉపాధ్యాయులు చేయగలిగే అతిపెద్ద సేవ. తరగతి గదిలో పాఠాలను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు సృజనాత్మక పద్ధతులను అనుసరించాలి. విద్యార్థుల అకడమిక్ పనితీరును మాత్రమే ప్రామాణికంగా తీసుకోకూడదు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపిస్తున్నాయా? వారి రోజువారీ జీవితం ఎలా ఉంది? అనే విషయాలను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలి. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పిల్లలపై తల్లిదండ్రులతో పాటు ఇతర కుటుంబసభ్యుల పర్యవేక్షణ కూడా ఉండేది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్న నేపథ్యంలో విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత పెరిగింది."

డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో మాదకద్రవ్యాల సమస్యను గుర్తించడం కష్టంగా మారుతోందని మోదీ అన్నారు. ఎవరు ఎవరికి ఏం ఇస్తున్నారో తెలుసుకోవడం కూడా కష్టమైన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులే డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు. అదే సమయంలో ఏ విద్యార్థి ప్రవర్తనలోనైనా ఆకస్మిక మార్పులు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా నిశితంగా పరిశీలించాలని చెప్పారు.

'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'

విద్యార్థుల్లో అధిక స్క్రీన్ టైమ్ మరో ప్రధాన సమస్యగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. పిల్లలు రోజులో ఎంతసేపు మొబైల్, ఇతర స్క్రీన్లను చూస్తున్నారు? రాత్రివేళల్లోనూ ఫోన్లు ఉపయోగిస్తున్నారా? అనే విషయాలను తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించాలని సూచించారు. స్క్రీన్ టైమ్‌ను తగ్గించేందుకు కేవలం ఆంక్షలు విధించడం కంటే పిల్లల్లో క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా సహజంగానే మొబైల్ వినియోగాన్ని తగ్గించవచ్చని మోదీ అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్?ఈపీ)ను ప్రస్తావించిన ప్రధాని పిల్లలను తరగతి గదికే పరిమితం చేయకూడదని అన్నారు. నిజ జీవిత నైపుణ్యాలు, వివిధ రకాల పనులు, సమాజంతో వారికి పరిచయం కల్పించాలని సూచించారు. విద్య కేవలం పుస్తకాల్లోని విషయాలకు పరిమితం కాకుండా జీవితాన్ని అర్థం చేసుకునేలా ఉండాలని పేర్కొన్నారు.

మహిళల్లో క్యాన్సర్ అవగాహనపై ప్రశంస

తన పరిసర ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న ఓ ఉపాధ్యాయురాలి ప్రయత్నాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో తాను రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్ కోసం ముందుకు వస్తున్నారని, ఈ కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా నమోదైనట్లు మోదీ తెలిపారు.

82 మంది ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు

ఈ ఏడాది జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు మొత్తం 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు ఎంపికయ్యారు. ఇందులో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం నుంచి 48 మంది, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్?ల నుంచి 21 మంది, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖకు చెందిన 13 మంది స్కిల్ ట్రైనర్లు ఉన్నారు.

ఈ నెల 9వ తేదీ లోగా ఇరాన్‌పై దాడి

న్యూఢిల్లీ : ఇరాన్‌పై పునఃప్రారంభించిన సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు. అయితే, అవసరమైతే అమెరికా మళ్లీ దాడి చేయవచ్చని ఆయన హెచ్చరిక కూడా జారీ చేశారు. ఈ రెండు అంశాలు ఒక అతిపెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి:ఇరాన్ జాతకం, వార్షిక అంచనాలు, రాబోయే ఆరు రోజుల పంచాంగాన్ని పరిశీలిస్తే, ప్రమాదం ఇంకా తొలగిపోలేదు. సెప్టెంబర్ 6, 8 తేదీలు ముఖ్యంగా ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. అయితే, దీనిని దాడి కచ్చితంగా జరుగుతుందని చెప్పే అంచనాగా పరిగణించలేము. ఈ తేదీలలో జరిగే ఏ సైనిక చర్య అయినా, ప్రతీకార దాడి అయినా, నౌకకు సంబంధించిన సంఘటన అయినా, లేదా సాంకేతిక వైఫల్యం అయినా ఉద్రిక్తతలను పెంచవచ్చు.ఇరాన్‌పై అమెరికా చేపట్టిన కొత్త సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని సెప్టెంబర్ 2న ట్రంప్ అన్నారు. హోర్ముజ్ సమీపంలో అమెరికా సైన్యం ఇరాన్ రాడార్, క్షిపణి వ్యవస్థలు, సముద్ర మైన్లు అమర్చే పరికరాలను ధ్వంసం చేసిందని ఆయన పేర్కొన్నారు.అమెరికా ఎప్పుడైనా మరో దాడిని ప్రారంభించవచ్చని ట్రంప్ కూడా పేర్కొన్నారు. దీని అర్థం, సైనిక చర్యను నిలిపివేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. మరో దాడి జరుగుతుందా లేదా అనేది ఇరాన్ ప్రతిస్పందన ,హోర్ముజ్‌లోని పరిస్థితిపై ఆధారపడి ఉంటుందిఅమెరికా జరిపిన తాజా దాడులతో ఇరాన్ జోర్డాన్, బహ్రెయిన్, కువైట్, ఇరాక్‌లలోని అమెరికా స్థావరాలు, ప్రయోజనాల వైపు క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించింది. ఈ దాడులలో పలువురిని గగనతలంలోనే అడ్డుకున్నట్లు ఆ దేశం ప్రకటించింది. అమెరికా దాడుల్లో 18 మంది మరణించారని, 108 మంది గాయపడ్డారని ఇరాన్ పేర్కొంది. హోర్ముజ్ సమీపంలో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. పౌర మృతిపై వచ్చిన నివేదికలపై దర్యాప్తు చేస్తున్నట్లు అమెరికా తెలిపింది. ఈ సంఘటన పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఇరాన్ తన ప్రతీకార చర్యలను తీవ్రతరం చేస్తే, అమెరికా దీనిని ఒక కొత్త దాడికి ఆధారంగా ఉపయోగించుకోవచ్చు. మరోవైపు, ఇరాన్ మౌనం దాని సొంత దేశంలోనే బలహీనతగా భావించబడవచ్చు.సెప్టెంబర్ 6వ తేదీ ఆకస్మిక సైనిక లేదా సాంకేతిక సంఘటనకు అత్యంత అవకాశం ఉన్న రోజు. సెప్టెంబర్ 8వ తేదీ ప్రత్యర్థి పక్షం ద్వారా మరో ప్రధాన చర్య లేదా ఎదురుదాడికి వేదిక కావచ్చు.సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని ట్రంప్ చెబుతున్నప్పటికీ, సెప్టెంబర్ 9వ తేదీకి ముందే యుద్ధం మరో మలుపు తిరగవచ్చు. ఆ తర్వాత కాల్పులు పూర్తిగా ఆగిపోయే అవకాశం లేదు. కానీ, చర్చల కోసం యుద్ధం తిరిగి ప్రారంభమయ్యే అవకాశం మాత్రం ఖచ్చితంగా పెరుగుతుంది

కలిసొచ్చిన ఏఐ రంగం..

15 ట్రిలియన్ డాలర్లకు చేరిన కుబేరుల సంపద

కృత్రిమ మేధ కారణంగా ఒకవైపు చాలామంది ఉద్యోగాలు కోల్పోతుంటే.. మరోవైపు పెద్ద పెద్ద కంపెనీలు భారీగా సంపద సృష్టిస్తున్నాయి. ఏఐ రంగంలో పెట్టుబడులు కలసిరావడంతో ప్రపంచవ్యాప్తంగా సంపన్నుల జనాభా పెరుగుతోంది. గతేడాది బిలియనీర్ల సంఖ్య దాదాపు 3800కు చేరినట్లు గ్లోబల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ అల్టాటా తన వెల్త్ రిపోర్ట్‌లో వెల్లడించింది. వీరి మొత్తం సంపద సుమారు 15.1 ట్రిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం.. రూ.1,417.37 లక్షల కోట్లు) చేరుకున్నట్లు తెలిపింది. గత 5 ఏళ్లలో ఏఐ రంగంలో సగటున 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.283.25 కోట్లు) వరకు పెట్టుబడులు చేసిన కంపెనీలు అధిక మార్కెట్ విలువను సాధించాయని అల్టాటా తన నివేదికలో పేర్కొంది. దీంతో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరగ్గా.. కుబేరుల సంఖ్య 8.2 శాతం ఎగబాకింది. ఏఐ రంగానికి సంబంధించిన టెక్నాలజీ స్టాక్స్‌లో పెట్టుబడులు భారీ సంపద సృష్టించాయని నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుబేరుల మొత్తం సంపదలో.. 27శాతం కేవలం 29 మంది సూపర్ బిలియనీర్ల (50 బిలియన్ డాలర్లను మించి ఆదాయం ఉన్న వారిని ఇలా పరిగణిస్తారు) వద్దే ఉన్నట్లు పేర్కొంది. అత్యధికంగా 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా మొదటి స్థానంలో నిలవగా, 1,081 మందితో ఐరోపా రెండో స్థానంలో ఉంది. ఆసియాలో 881 మంది బిలియనీర్లు ఉన్నారు. మొత్తం సంపన్నుల్లో మహిళలు కేవలం 13 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.

డిజిటల్ పరిజ్ఞానంతో మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకుంటే అపార అవకాశాలు

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ఇబ్రహీంపట్నం, మహానగర్

స్వయం సహాయక సంఘాల మహిళలు డిజిటల్, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడంతోపాటు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. మండల పరిధిలోని గుంటుపల్లి రైజ్ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తల కోసం శనివారం నిర్వహించిన 'వర్క్‌షాప్ ఆన్ డిజిటల్ అండ్ టెక్నాలజీ అవేర్‌నెస్ ఫర్ ఎస్‌హెచ్‌జీ ఎంటర్‌ప్రెన్యూర్స్' కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మహిళలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాపార రంగంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తుల ప్రచారం, మార్కెటింగ్, కస్టమర్లకు చేరువ కావడం, ఆన్‌లైన్ విక్రయాలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో వ్యాపార అవకాశాలు పొందడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యానికి అనుగుణంగా ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం ఉపాధి పొందేవారిగా కాకుండా ఇతరులకు ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తుల్లో నాణ్యత, ప్యాకేజింగ్, బ్రాండింగ్‌తోపాటు డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవడం ద్వారా పెద్ద మార్కెట్‌ను చేరుకోవచ్చన్నారు. వర్క్‌షాప్‌లో డీఎక్స్ఎడ్జ్ ఏ సీఐఐ నుంచి రిసోర్స్ పర్సన్ ప్రసన్న, వాల్‌మార్ట్ వృద్ధి సంస్థ నుంచి శ్రీనివాస్, జెమ్ నుంచి యశ్వంత్ పాల్గొని డిజిటల్ టెక్నాలజీ, ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ వ్యాపార అవకాశాలు, ప్రభుత్వ సంస్థలకు ఉత్పత్తులు, సేవలు అందించే అవకాశాలపై మహిళా పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు తమ చిన్నతరహా వ్యాపారాలను విస్తరించుకుని స్థానిక మార్కెట్ నుంచి జాతీయ స్థాయి మార్కెట్ వరకు ఉత్పత్తులను తీసుకెళ్లేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, మహానగర్



ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాతలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక రెవెన్యూ హాలులో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గత రెండేళ్లలో ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను ప్రత్యేక జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్యార్థులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రస్తుతం రియాలిటీని వీడి రీల్స్ మోజులో పడుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు మంచి, చెడుల మధ్య తేడాను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. నేటి ఐటీ, ఏఐ యుగంలో ఉపాధ్యాయులు కూడా నిత్య విద్యార్థులుగా మారి నిరంతరం అధ్యయనం చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు తమ బోధనా అనుభవాలను రచనల రూపంలో అందించి భావితరాలకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, తహసీల్దార్ బీ.అంకాలు, విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, నవజీవన్ విద్యాసంస్థల చైర్మన్ కొండవీటి ఈశ్వరరావు, ఎంఈఓలు శివశంకర్, అన్నపరెడ్డి పిచ్చియ్య, కమ్మిలి నాంచారయ్య, టీవీఎం రాందాస్, సనకా శ్రీకాంత్, జీ.ఎన్.బీ.గోపాల్, మోమిన్, ఏవీ రమణ, ఉపాధ్యాయులు సూరగం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ ఎన్ఆర్ఐ డీమ్డ్ యూనివర్సిటీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- ఉత్సాహంగా 'కోడ్ స్టార్మ్' కోడింగ్ పోటీలు

ఆగిరిపల్లి, మహానగర్



మండల పరిధిలోని పోతవరప్పాడులోని డాక్టర్ ఆర్.వి.ఆర్. ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ)లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు శనివారం నిర్వహించిన 'కోడ్ స్టార్మ్' కోడింగ్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. విశ్వవిద్యాలయంలోని వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పైథాన్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లోని సంక్లిష్ట సమస్యలను పరిష్కరిస్తూ విద్యార్థులు అల్గారిథమిక్ ఆలోచనా విధానం, కోడింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ ఆర్. వెంకట్రావు, సీఈవో తేజ కృష్ణ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.ఆర్.ఎస్. సాంబశివరావు, ప్రో-వైస్ ఛాన్సలర్ పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు కోడింగ్, అనలిటికల్, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, డీన్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

రాష్ట్ర సర్వే, సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్

ఇబ్రహీంపట్నం, మహానగర్



భూముల రీసర్వేలో రైతులను భాగస్వాములను చేసి, ముందుగానే సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని రాష్ట్ర సర్వే, సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. రైతుల ఈ-కేవైసీని తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేను జిల్లా రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమక్షంలోనే సర్వే జరుగుతుండటంపై కుర్మనాథ్ సంతృప్తి వ్యక్తం చేశారు. రీసర్వేలో తప్పులు పునరావృతం కాకుండా పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే ప్రారంభించే రోజున సంబంధిత రైతు లేదా కుటుంబ సభ్యులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండేలా చూడాలని, సర్వే అనంతరం డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా రైతు సమక్షంలోనే భూ సరిహద్దులను నిర్ధారించాలని సూచించారు. సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాస్‌బుక్ రైతు చేతికి అందే వరకు సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని జిల్లా సర్వే అధికారి వై. మోహన్‌రావును ఆదేశించారు. ఈ సందర్భంగా కుర్మనాథ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రీసర్వేలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో 'రీసర్వే--2.0' చేపట్టినట్లు తెలిపారు. రీసర్వే అనంతరం రైతు చూపించిన భూ హద్దుల ఆధారంగా వివరాలను నోటీసు రూపంలో తెలియజేసి, వాటిని సంబంధిత డాక్యుమెంట్లతో సరిపోల్చి నిర్ధారిస్తామని చెప్పారు. ఈ-కేవైసీ ద్వారా రైతు సమక్షంలోనే సర్వే నిర్వహించడంతోపాటు, ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రీసర్వేను ఫేజ్--1లో 628, ఫేజ్--2లో 748, ఫేజ్--3లో 729, ఫేజ్--4లో 1,645 గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 2,800 బృందాలతో అత్యాధునిక రోవర్ సాంకేతికతను వినియోగించి సర్వే కొనసాగుతోందన్నారు. క్షేత్రస్థాయిలోని భూ వివరాలను, డాక్యుమెంట్లలోని వివరాలను రైతుల సమక్షంలోనే సరిపోల్చి భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా, రైతులు సంతృప్తి చెందేలా రీసర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫేజ్--5లో రాష్ట్రవ్యాప్తంగా 1,343 గ్రామాల్లో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో రీసర్వే నిర్వహిస్తున్నామని, దీనిపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 2027 మార్చి నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు సర్వే, రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తున్నారని కుర్మనాథ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి వై. మోహన్‌రావు, తహసీల్దార్ రిబ్కా, గుంటుపల్లి గ్రామ సర్వేయర్లు దత్త, శ్యామ్‌సన్, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాలంపల్లిలో పోలీసుల 'పల్లె నిద్ర'

స్వేచ్ఛాయుత ఎన్నికలు, గ్రామ సురక్షతే ధ్యేయం

రూరల్ జోన్ డీసీపీ లక్ష్మీనారాయణ

వత్సవాయి, నంబర్ పన్



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలను పరిరక్షించడమే పోలీస్ శాఖ లక్ష్యమని జిల్లా రూరల్ జోన్ డీసీపీ బి. లక్ష్మీనారాయణ, ఐపీఎస్ తెలిపారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు వత్సవాయి మండలం పొలంపల్లి గ్రామంలో శనివారం రాత్రి డీసీపీ ఆధ్వర్యంలో 'పల్లె నిద్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బెదిరింపులు, వర్గ విభేదాలు, ప్రలోభాలు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, నిర్ధారణ లేని సమాచారం, వర్గాలను రెచ్చగొట్టే పోస్టులను ప్రచారం చేయవద్దని సూచించారు. గ్రామంలో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ, ఏటీఎం/కార్డు వివరాలు, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోరాదని సూచించారు. నకిలీ ఉద్యోగాలు, ట్రేడింగ్, లోన్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రజలు పోలీసులతో కలిసి పనిచేయాలని, గంజాయి నిర్మూలనకు చేపట్టిన 'ఈగిల్ ఛాలెంజ్'లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్ బాలికల సోషల్ మీడియా వినియోగం, ఆన్‌లైన్ పరిచయాలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలను సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, గణేష్ మండపాల ఏర్పాటు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి ముందస్తు అనుమతులు తీసుకుని అధికారులకు సహకరించాలని డీసీపీ కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ శ్రీనివాసరావు, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు, వత్సవాయి ఎస్ఐ, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం సానుకూల నిర్ణయాలు

- ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు

అమరావతి, మహానగర్



ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించడంపై ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హామీలపై సీఎం సానుకూలంగా స్పందించి పలు నిర్ణయాలు తీసుకున్నారని రవీంద్రరాజు తెలిపారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించడంతో పాటు ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు చెల్లించేందుకు నిర్ణయించారని పేర్కొన్నారు. 2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి రావాల్సిన డీఏలను విడుదల చేయడానికి అంగీకరించారని తెలిపారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవ్ నగదును వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు అంగీకరించారని చెప్పారు. పోలీసులకు అదనంగా ఒక సరెండర్ లీవ్‌ను దసరాకు చెల్లించేందుకు నిర్ణయించారని పేర్కొన్నారు. అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి అమలు చేయాలని నిర్ణయించారని తెలిపారు. 70 ఏళ్ల దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్ల దాటిన వారికి 15 శాతం అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింపజేయనున్నట్లు వివరించారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను స్ట్రీమ్‌లైన్ చేసి, వచ్చే నెల నుంచి ఏ నెలకు ఆ నెలలోనే ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుకు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకునేందుకు అంగీకరించారని రవీంద్రరాజు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కారానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రికి మెమెంటో అందజేసి శాలువాతో సన్మానించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరిపల్లి రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంధ క్రికెటర్లకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా

- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఐదుగురు క్రీడాకారులకు పాలసీలు అందజేత

విజయవాడ, మహానగర్

అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతిభ కనబరుస్తున్న అంధ క్రికెటర్ల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అండగా నిలిచింది. నగరంలోని ఏసీఏ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అంతర్జాతీయ అంధ క్రికెటర్లకు ఆరోగ్య బీమా పాలసీలను అందజేశారు. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్ (సీఏబీఏపీ), డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (డీసీసీఏపీ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదుగురు అంధ క్రికెటర్లకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా కవరేజీ కలిగిన పాలసీలను ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రధాన కార్యదర్శి సానా సతీష్ బాబు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ దివ్యాంగ క్రీడాకారులు తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. సాధారణ క్రికెటర్లతో సమానంగా దివ్యాంగ క్రికెటర్లను గౌరవిస్తూ, వారి అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఏసీఏ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు భద్రత, ప్రోత్సాహం కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఏసీఏ ప్రధాన కార్యదర్శి సానా సతీష్ బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగ క్రికెట్ అభివృద్ధికి ఏసీఏ అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. మెరుగైన శిక్షణ, వసతులు, ప్రోత్సాహం, భద్రత కల్పించడమే తమ లక్ష్యమని, అంతర్జాతీయ స్థాయిలో దివ్యాంగ క్రికెటర్లు మరింతగా రాణించేలా సహకారం కొనసాగిస్తామని చెప్పారు. అర్జున అవార్డు గ్రహీత, భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఇ. అజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల ఆరోగ్య భద్రత ఎంతో ముఖ్యమన్నారు.



తాను భారత జట్టు తరపున ఆడుతున్న సమయంలో పలుమార్లు తీవ్ర గాయాలకు గురయ్యానని, సరైన ఆరోగ్య బీమా లేకపోవడంతో చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. తనలాంటి పరిస్థితి మరే అంధ క్రికెటర్‌కు రాకూడదనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న ఐదుగురు అంధ క్రికెటర్లకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించేందుకు ముందుకొచ్చినట్లు వివరించారు. బీమా పాలసీలు అందుకున్న వారిలో ప్రస్తుత భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దుర్గారావుతో పాటు వెంకటేష్, రవి, దున్న వెంకటేశ్వరరావు, సత్యవతి ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన డెఫ్ క్రికెటర్లను కూడా ఈ సందర్భంగా ఏసీఏ ఘనంగా సన్మానించింది. ఇంగ్లండ్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన మిక్స్‌డ్ డిజేబుల్డ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న డెఫ్ క్రికెటర్ యశ్వంత్ నాయుడును, శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ డెఫ్ అండ్ డంబ్ ఉమెన్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన జోష్నా రెడ్డిని కేశినేని శివనాథ్, సానా సతీష్ బాబు శాలువాలతో సత్కరించి అభినందించారు. సీఏబీఏపీ రాష్ట్ర కార్యదర్శి జి. రవీంద్రబాబు మాట్లాడుతూ దివ్యాంగ క్రికెట్ అభివృద్ధికి ఏసీఏ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో దివ్యాంగుల క్రికెట్‌కు ఏసీఏ అందించిన ఆర్థిక సహకారానికి, క్రీడాకారులకు అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి ఏసీఏ అధ్యక్షుడు, కార్యదర్శి, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీఏపీ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులు

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

మార్కులకే పరిమితం కాకుండా విలువల విద్య అందించాలి

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎం. నవీన్

మచిలీపట్నం, మహానగర్:

ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విద్యార్థుల్లో విలువలు, మానవీయత, ఆత్మవిశ్వాసం, దేశభక్తి వంటి సుగుణాలను పెంపొందించి బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎం. నవీన్ అన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జిల్లా స్థాయి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లాలో విద్యాభివృద్ధికి ఉత్తమ సేవలు అందించిన 39 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎం. నవీన్ మాట్లాడుతూ తల్లి, తండ్రి, గురువు ప్రతి వ్యక్తి జీవితంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థుల నిర్మాణాత్మక దశలో ఉపాధ్యాయుల ప్రవర్తన, మాటతీరు, వ్యవహారశైలి, క్రమశిక్షణ, బోధనా విధానాలను విద్యార్థులు నిశితంగా గమనిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు చేసే ప్రతి పని విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుందని, అందువల్ల మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులూ ఉపాధ్యాయుల బాధ్యతేనని స్పష్టం చేశారు. అధిక మార్కులు సాధించిన



విద్యార్థిని ప్రోత్సహించే విధంగానే తక్కువ మార్కులు సాధిస్తున్న విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక అవసరాలు ఉంటాయని, వాటిని గుర్తించి తగిన విధంగా బోధించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా విస్తృత సమాచారాన్ని పొందగలుగుతున్నప్పటికీ విద్యార్థి ఎందుకు ప్రశ్న అడుగుతున్నాడు, అతనికి ఏం అవసరం, అతని బలాలు, బలహీనతలు ఏమిటో గుర్తించి ఆత్మవిశ్వాసాన్ని నింపగలిగేది ఉపాధ్యాయుడు మాత్రమేనని అన్నారు. విద్యార్థులకు కేవలం సమాచారాన్ని అందించకుండా స్ఫూర్తి, విలువలు, మానవీయ దృక్పథాన్ని నేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న మౌలిక, డిజిటల్ సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకుని బోధనా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ఏఐ సహా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని అన్నారు. తెలుగు భాష పరిరక్షణకు కూడా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థులకు తెలుగు భాషను సరిగ్గా మాట్లాడటం, చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ నిర్దేశించిన 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యాన్ని సాధించేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పిలుపునిచ్చారు. 100 శాతం ఫలితాలు సాధించాలంటే ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు చదువులో వెనుకబడిన చివరి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టి సారించి అతనిని కూడా ఉత్తీర్ణుడిగా తీర్చిదిద్దాలని సూచించారు. వచ్చే ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు మరింత ప్రోత్సాహం, గుర్తింపు కల్పించాలని కోరారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం ప్రతి శనివారాన్ని కాలుష్య రహిత దినంగా పాటిస్తున్న నేపథ్యంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎం. నవీన్ సైకిల్‌పై ప్రయాణించి జెడ్పీ కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా ఆయన సందేశమిచ్చారు. కార్యక్రమంలో డీఈఓ యువి సుబ్బారావు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, డిప్యూటీ డీఈవోలు శేఖర్ సింగ్, కే. రవికుమార్, ఏడీ ఎం. విద్యాలత, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే. విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనాల్లోకి జై కొట్టు నినాదం

విజయవాడ

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ యువ ఓటర్లపై కన్నేశారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదు.. రానున్న ఏ ఎన్నికల్లోనైనా యువత ఓటర్లను ఆకట్టుకోవాలన్న లక్ష్యంగా జనసేన పనిని ప్రారంభించింది. ఇందులో భాగంగా జనసేన యువజన విభాగాన్ని ఆర్భాటంగా పవన్ కల్యాణ్ పుట్టిన రోజు నాడు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా జెన్ జీ ఫీవర్ అన్ని రాజకీయ పార్టీలను పట్టిపీడిస్తుంది. అందులో భాగంగా జనసేన కూడా యువత ఓట్ల కోసం వేట ప్రారంభించింది. పవన్ కల్యాణ్ పై గత రెండేళ్ల నుంచి ఎలాంటి అవినీతి ముద్ర పడలేదు. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సజావుగా, సమర్థవంతంగా చేస్తున్నారన్న ప్రశంసలను కూడా అందుకుంటున్నారు. అవినీతి మరక అంటకుండా ఉన్న తనకు అండగా నిలబడాలని పవన్ కల్యాణ్ కోరుకుంటున్నారు. యువత అండగా నిలిస్తే విజయం నల్లేరు మీద నడకేనని భావిస్తున్నారు.ఇలాగే తన వైఖరిని కొనసాగిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేనకు కూటమిలో పొత్తులో భాగంగా అత్యధిక స్థానాలను పొందవచ్చు. యువ నేతలకు పోటీకి అవకాశమిస్తే ప్రజల నుంచి కూడా ఆదరణ లభించే ఛాన్స్ ఉంది. కేవలం కాపు సామాజికవర్గానికి చెందిన ఓటర్ల పైనే ఆధార పడకుండా యువ ఓటర్లను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేయనున్నారు. పవన్ కల్యాణ్ కేరళ నుంచి తిరిగి వచ్చిన వెంటనే యువతతో ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకవైపు పార్టీ బలాన్ని పెంచుకోవడం, ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటితే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింతగా ఎదిగే అవకాశాలు ఉంటాయని జనసేన పార్టీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. యువత, మహిళ ఓటర్లను ఆకట్టుకోగలిగితే ఇక తనపై సామాజికవర్గం ముద్ర పడకపోయినా పెద్దగా ఉండదని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జైకొట్టు నినాదంతో... జనసేన పార్టీ యువతను, ముఖ్యంగా 'జెన్-జీ' ని ఆకట్టుకోవడానికి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళ్తోంది.'జై కొట్టు' యువజన విభాగంపవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా పిఠాపురంలో జనసేన తొలిసారిగా ప్రత్యేక యువజన విభాగాన్ని ఆవిష్కరించింది.'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' స్ఫూర్తితో ఈ విభాగానికి 'జై కొట్టు' అని పేరు పెట్టారు.జెన్-జీ యువతను రాజకీయాల్లోకి, సామాజిక కార్యక్రమాల్లోకి భాగస్వామ్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. నేటి తరానికి తగినట్లుగా ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేస్తూ పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సంభాషణలు సాగించనున్నారు.సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు.

అండర్-19 జాతీయ మహిళల జట్టుకు దీక్షా కాట్రగడ్డ ఎంపిక గర్వకారణం



విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

గుంటూరుకు చెందిన యువ క్రికెటర్ దీక్షా కాట్రగడ్డ భారత అండర్-19 మహిళల క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ గర్వకారణమని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. భారత అండర్-19 మహిళల జట్టుకు ఎంపికైన దీక్షా కాట్రగడ్డను ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, జనరల్ సెక్రటరీ సానా సతీష్ శనివారం అభినందించారు. ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. దీక్షా సాధించిన విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ దీక్షా తన ప్రతిభ, కృషి, పట్టుదలతో భారత అండర్-19 జట్టులో స్థానం సంపాదించడం అభినందనీయమన్నారు. ఆమె విజయం గుంటూరు జిల్లాకే కాకుండా యావత్ ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని తెలిపారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ, మౌలిక వసతులు కల్పించేందుకు ఏసీఏ కృషి చేస్తుందని తెలిపారు. ఏసీఏ జనరల్ సెక్రటరీ సానా సతీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిభ కలిగిన యువ క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఏసీఏ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణతో పాటు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, అవసరమైన అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీక్షా కాట్రగడ్డ భారత అండర్-19 మహిళల జట్టుకు ఎంపిక కావడం ఆంధ్ర క్రికెట్‌కు ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదిగి భవిష్యత్తులో భారత మహిళల సీనియర్ క్రికెట్ జట్టులోనూ చోటు సంపాదించాలని ఆకాంక్షించారు.

ఈ నెల 24న ఫ్లిప్‌కార్ట్‌లో మివి వన్ విడుదల

విజయవాడ



స్వదేశీ వినియోగదారుల టెక్నాలజీ బ్రాండ్ మివి స్మార్ట్‌ఫోన్ విభాగంలోకి అడుగుపెడుతోంది. ఇందులో భాగంగా తన తొలి స్మార్ట్‌ఫోన్ 'మివి వన్'ను ఈ నెల 24న ప్రత్యేకంగా ఫ్లిప్‌కార్ట్ ద్వారా విడుదల చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. క్వాల్‌కామ్, ఫ్లిప్‌కార్ట్, గూగుల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఈ స్మార్ట్‌ఫోన్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. భారతీయ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మివి వన్‌ను రూపొందించినట్లు కంపెనీ పేర్కొంది. స్నాప్‌డ్రాగన్ 5జీ మొబైల్ ప్లాట్‌ఫామ్‌తో కూడిన ఈ ఫోన్ హైస్పీడ్ కనెక్టివిటీ, మెరుగైన పనితీరును అందించనుంది. దేశీయ ఆర్‌అండ్‌డీ, ఇంజినీరింగ్, తయారీ సామర్థ్యాలను మరింత విస్తరించే దిశగా ఈ ఉత్పత్తిని హైదరాబాద్‌లోని మివి తయారీ కేంద్రంలో రూపొందిస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే ట్రూ వైర్‌లెస్ ఇయర్‌బడ్స్, నెక్‌బ్యాండ్లు, హెడ్‌ఫోన్లు, స్పీకర్లు, సౌండ్‌బార్లతో ఆడియో విభాగంలో గుర్తింపు పొందిన మివి, స్మార్ట్‌ఫోన్ రంగంలోనూ తనదైన స్థానాన్ని ఏర్పరచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఫ్లిప్‌కార్ట్ డిజిటల్ కామర్స్ వ్యవస్థ, దేశవ్యాప్త విస్తరణ, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ద్వారా మివి వన్‌ను దేశవ్యాప్తంగా వినియోగదారులకు అందించనుంది. మివి సహ వ్యవస్థాపకుడు విశ్వనాథ్ కందుల మాట్లాడుతూ, భారత్ నుంచి గ్లోబల్ కన్స్యూమర్ టెక్నాలజీ సంస్థను నిర్మించాలనే లక్ష్యంలో మివి వన్ తొలి అడుగని తెలిపారు.

సుజనా ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విజయవాడ, మహానగర్

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలోని సుజనా ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం బబ్బూరి గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలను ఉచితంగా అందించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి వారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో డెంటల్, కంటి పరీక్షలతో పాటు జనరల్ ఫిజీషియన్ సేవలు, బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే, రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సుమారు 60 మందికి నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో వైద్య పరీక్షలు, చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసింది. పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించడమే లక్ష్యంగా సుజనా ఫౌండేషన్ పనిచేస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, ప్రభుత్వ డెంటల్ వైద్యులు, అమరావతి కంటి వైద్యులు, సుజనా ఫౌండేషన్ సిబ్బంది శిబిరంలో సేవలందించారు. 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పీవీ చిన సుబ్బయ్య, టీడీపీ నేతలు మన్నెం నారాయణ, రామనాయుడు, బీజేపీ నాయకుడు గన్నవరపు శ్రీనివాసరావు, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

‘ఆ నలుగురు’ దర్శకుడి కొత్త ప్రయోగం!

భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌తో సినిమా..



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ మరో వినూత్న ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ‘ఆ నలుగురు’, ‘మధుమాసం’, ‘అందరి బంధువయా’, ‘ఆటగదరా శివా’ వంటి వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆయన, తాజాగా ‘ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు’ అనే హై-కాన్సెప్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రానికి దర్శకత్వం వహించారు. ‘ఎ ఫర్‌బిడెన్ రాగ ఫ్రమ్ ఎ ఫర్‌బిడెన్ సాగా’ అనేది దీనికి ఉప శీర్షిక. ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై చంద్ర సిద్ధార్థ్ స్వయంగా నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.వీశీజఱవం ఇది కేవలం సినిమా మాత్రమే కాదని, భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌తో వస్తున్న తొలి చిత్రమని యూనిట్ చెబుతోంది. ప్రముఖ దివంగత దర్శక-రచయిత మదన్ అందించిన కథతో ఈ సినిమా రూపొందింది. మదన్ తన చివరి రోజుల్లో ప్లాన్ చేసిన ఈ కథాంశంపై చంద్ర సిద్ధార్థ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఒకప్పుడు మదన్ అందించిన కథతోనే ‘ఆ నలుగురు’ వంటి క్లాసిక్ చిత్రాన్ని తీసిన చంద్ర సిద్ధార్థ్, ఇప్పుడు మరోసారి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు. ఈ చిత్ర కథాంశం అత్యంత ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతిరోజూ రాత్రి సరిగ్గా పదిన్నర గంటలకు ఒక నిర్దిష్ట రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతూ ఉంటుంది. ఆ పాటను నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు కోరుతుంటారు. ఈ విభిన్నమైన కాన్సెప్ట్ ఆధారంగానే సినిమా టైటిల్‌ను పెట్టడం విశేషం. కేవలం వినోదం మాత్రమే కాకుండా, ఇది తెలుగు తెరపై వస్తున్న మొట్టమొదటి మిస్టరీ మ్యూజికల్ చిత్రం కావడం మరో ప్రత్యేకత. సౌండ్ థెరపీ, న్యూరోసైన్స్, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, మానవ మెదడుకు, ధ్వనికి మధ్య ఉన్న సంబంధం, అపరాధ భావన వంటి సరికొత్త అంశాలను మేళవించి దర్శకుడు ఈ మిస్టరీ కథనాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంతో హర్ష హీరోగా టాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. ఆయన సరసన అమైరా గోస్వామి కథానాయికగా నటిస్తుండగా, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ అనిరుధ్ శ్రీవాస్తవ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా, సన్నీ, గిరి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రంలో సంగీతానికి అత్యంత ప్రాధాన్యత ఉండటంతో జే రెక్స్ అందించిన బాణీలు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ సినిమాకు కథ: మదన్, సంగీతం: జే రెక్స్, పాటలు: చంద్ర సిద్ధార్థ్, మాటలు: పులగం చిన్నారాయణ, ఆర్ట్: అంజి కొయ్యల, సినిమాటోగ్రఫీ: సామ్ సుప్రీత్, ఎడిటింగ్: బొబ్బిలి భానుప్రకాశ్, గిరిధర్, సహ నిర్మాతలు: అగస్త్య మంజు, సాగర్, మహి, సమర్పణ: వై.వి.సత్యనారాయణ రాజు అందించగా, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వంతో పాటు నిర్మాణ బాధ్యతలను చంద్ర సిద్ధార్థ్ స్వయంగా నిర్వర్తించారు. విభిన్నమైన కథాంశాలతో ప్రయోగాత్మక చిత్రాలను ఆదరించే తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ వినూత్న ప్రయత్నం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.



18 ఏళ్ల సినీ ప్రయాణం.. అభిమానులకు నాని స్పెషల్ ప్రామిస్.. ‘ది ప్యారడైజ్’ క్లిప్ వైరల్

టాలీవుడ్‌లో ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా తన స్వశక్తితో ఎదిగి స్టార్ హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయకుల్లో నేచురల్ స్టార్ నాని ఒకరు. సహజమైన నటన, విభిన్నమైన కథల ఎంపిక, తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ తన అభిరుచిని చాటుకుంటున్న నాని.. తాజాగా తన సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని పూర్తి చేసుకున్నారు. నాని సినీ రంగ ప్రవేశం చేసి తాజాగా 18 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక పోస్టులు, ఎడిట్స్, వీడియోలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. నాని కెరీర్‌లోని కీలక చిత్రాలను గుర్తు చేసుకుంటూ.. ఆయన సాధించిన విజయాలను సెలబ్రేట్ చేశారు. ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా ఇండస్ట్రీలో అడుగుపెట్టి.. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత హీరోగా మారి నేచురల్ స్టార్‌గా ఎదిగిన నాని ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది. వరుస విజయాలతో పాటు వైవిధ్యమైన సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ క్రియేట్ చేసుకున్నారు. తన 18 ఏళ్ల సినీ ప్రయాణంపై నాని కూడా సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 18 ఏళ్లు పూర్తవడంతో సినిమాల్లో తాను ఇప్పుడు పెద్దవాడినయ్యాననే భావనను సరదాగా వ్యక్తం చేశారు. సాధారణంగా 18 ఏళ్లు దాటితే అడల్ట్ అంటారు కదా.. అదే విధంగా టాలీవుడ్‌లో కూడా తనకు 18 ఏళ్ల వయసు వచ్చినట్లుగా నాని సరదాగా చెప్పుకొచ్చారు.అయితే ఈ సందర్భంగా ఆయన చేసిన మరో కామెంట్ అభిమానులను మరింతగా ఆకట్టుకుంది. ఇన్నేళ్లుగా తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమను ఎప్పటికీ తేలికగా తీసుకోనని నాని స్పష్టం చేశారు. తన కెరీర్‌లో అభిమానుల పాత్ర ఎంతో కీలకమనే విషయాన్ని నాని మరోసారి గుర్తు చేసుకున్నారు. తనపై ప్రేక్షకులు, అభిమానులు చూపిస్తున్న ప్రేమను తాను ఎప్పుడూ అలుసుగా తీసుకోలేదని.. భవిష్యత్తులోనూ తీసుకోనని ప్రామిస్ చేశారు.18 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా నాని చేసిన ఈ మాటలు అభిమానులకు బాగా కనెక్ట్ అయ్యాయి. స్టార్ హీరోగా ఎదిగిన తర్వాత కూడా అభిమానుల ప్రేమకు ఇంత విలువ ఇస్తూ మాట్లాడటంతో సోషల్ మీడియాలో ఆయనపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.ఇక తన 18 ఏళ్ల సినీ ప్రయాణానికి సంబంధించిన ఈ ప్రత్యేక సందర్భాన్ని నాని తన రాబోయే చిత్రం ‘ది ప్యారడైజ్’కు సంబంధించిన క్లిప్‌తో పంచుకోవడం మరింత ఆసక్తిని పెంచింది. సినిమా నుంచి షేర్ చేసిన ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది.




‘లెనిన్’ హీరోయిన్‌కు మోహన్‌లాల్ సినిమా ఛాన్స్.. ‘ఆపరేషన్ గంగ’తో మాలీవుడ్ ఎంట్రీ!

ఈ ఏడాది టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్న సినిమాల్లో ‘లెనిన్’ కూడా ఒకటిగా నిలిచింది. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ చిత్రం ఇద్దరి కెరీర్‌లోనూ కీలకంగా మారింది. చాలాకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, భాగ్యశ్రీలకు ఈ సినిమా మంచి కంబ్యాక్‌ను అందించింది. ముఖ్యంగా ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే తన అందం, నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ‘లెనిన్’ తర్వాత ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు వస్తాయని భావించిన సమయంలోనే ఈ బ్యూటీ మరో భారీ ప్రాజెక్ట్‌ను సొంతం చేసుకున్నారు. అది కూడా మాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో మోహన్‌లాల్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం కావడం విశేషం. మోహన్‌లాల్ హీరోగా తెరకెక్కనున్న భారీ చిత్రం ‘ఆపరేషన్ గంగ’లో భాగ్యశ్రీ బోర్సే కీలక పాత్రలో నటించనున్నట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు.. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం ద్వారా ఆమె మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టబోతున్నారు. ఇప్పటికే ‘లెనిన్’తో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న భాగ్యశ్రీ.. ఇప్పుడు మోహన్‌లాల్ లాంటి సీనియర్ స్టార్‌తో కలిసి నటించే అవకాశం దక్కించుకోవడంతో ఆమె కెరీర్‌కు ఇది మరో కీలక మలుపుగా మారనుంది.అయితే సినిమాలో ఆమె పోషించబోయే పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. దీంతో మోహన్‌లాల్‌తో ఆమె స్క్రీన్ షేర్ చేసుకునే విధానం ఎలా ఉంటుంది? ఆమె పాత్ర కథలో ఎంత కీలకంగా ఉండబోతోంది? అనే ఆసక్తి నెలకొంది.

ఇండస్ట్రీ మారాలంటే ప్రేక్షకులు మారాలి

‘పెద్ది’ వివాదంపై తాప్సీ కామెంట్స్!

భారతీయ సినిమాలలో మహిళలను వస్తువులుగా చూపించడంపై నటి తాప్సీ పన్ను కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం దర్శక-నిర్మాతలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులు కూడా ఈ ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ‘పెద్ది’, ‘టాక్సిక్’ వంటి చిత్రాలపై వస్తున్న విమర్శల నేపథ్యంలో తాప్సీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒక ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ.. ప్రేక్షకులు కోరుకుంటున్నదే మేము ఇస్తున్నాము అనే వాదనను చిత్ర పరిశ్రమ తరచుగా తెరపైకి తెస్తుందని చెప్పారు. జనాలు ఏది కోరుకుంటే అది ఇవ్వకపోతే డబ్బులు ఎలా వస్తాయని మేకర్స్ భావిస్తారని, ఈ ఆలోచనా విధానం వల్ల అసలు కళ, నైపుణ్యం వెనుకబడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నటులు, దర్శకులు మాత్రమే ఈ సమస్యను పరిష్కరించలేరని, సోషల్ మీడియాలో ప్రేక్షకులు వ్యవహరించే తీరు ఈ సంస్కృతి కొనసాగడానికి కారణమవుతోందని ఆమె విమర్శించారు. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, కొందరు మాత్రం ఆ చిత్రాలలోని ఫోటోలను జూమ్ చేయడం, వీడియోలలో విచిత్రమైన కోణాలను ఉపయోగించి వైరల్ చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారని తాప్సీ గుర్తుచేశారు. దీనివల్ల సోషల్ మీడియాలో అలాంటి కంటెంట్‌కు ఆదరణ ఉందని మేకర్స్‌కు సంకేతాలు వెళ్తున్నాయని చెప్పారు. కోవిడ్ మహమ్మారికి ముందు భారతీయ సినిమా మంచి పురోగతిని సాధించి ప్రపంచ స్థాయి చిత్రాలతో పోటీ పడిందని, అయితే ఇప్పుడు మళ్లీ పరిశ్రమ వెనకడుగు వేస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై చిత్రనిర్మాతలు చివరికి బాధ్యతంతా ప్రేక్షకులపైనే నెట్టేస్తారని, ఆ సమయంలో నటుల దగ్గర ఎలాంటి సమాధానం ఉండదని తాప్సీ వాపోయారు. ఈ పోరాటంలో నటులు ఒంటరివారైపోతారని, కేవలం ప్రేక్షకులు మాత్రమే తమకు సహాయం చేసి ఈ యుద్ధంలో గెలిపించగలరని ఆమె పేర్కొన్నారు. కాగా, రామ్ చరణ్ హీరోగా నటించిన ‘పెద్ది’ చిత్రంలో జాన్వీ కపూర్ పాత్రపై వచ్చిన విమర్శలు, యష్ చిత్రం ‘టాక్సిక్’ లో మహిళల చిత్రీకరణపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరిగిన తరుణంలో తాప్సీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.



PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999